నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 23-5-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి : 26 సంచిక: 255 పేజీలు: 4 వెల: రూ. 1/-

ముగిసిన కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ భేటీ

మంచినీటి కోసం ఎపికి 2 టిఎంసిల నీటి విడుదల

హైదరాబాద్,మే22(ఆర్ఎన్ఎ): కృష్ణా రివర్ బోర్డు సెక్రటరీ పరమేశం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నీటి పారుదల ఇంజనీర్ ఇన్ చీఫ్ లతో శుక్రవారంనాడు సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య తాగు నీటి అవసరాలకు నీటి విడుదలపై చర్చ జరిగినట్లుగా తెలుస్తోంది. ఏపీ రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈఎన్సీ, తెలంగాణ రాష్ట్ర ఈఎన్సీలతొ కృష్ణా రివర్ బోర్డు సెక్రటరీ సమావేశమయ్యారు. ఏపీ అభ్యర్థనకు తాము సానుకూలంగా స్పందించినట్టుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధర్ రావు చెప్పారు. ఈ సమావేశంలో ఇతర విషయాలపై ఎలాంటి చర్చ జరగలేదని ని ఆయన వెల్లడించారు. పోతిరెడ్డిపాడు ప్రవాహ సామర్థ్యాన్ని పెంచుతూ ఏపీ ప్రభుత్వం ఈ నెల 5 వ తేదీన 203 జీవో జారీ చేసింది. తమ వాటా నుండే 2 టీఎంసీలను నీటిని తీసుకెళ్తున్నట్టుగా ఏపీ ఇంజనీర్ ఇన్ చీఫ్ చెప్పారు. సాగర్ కుడి కాల్వ నుండి తీసుకెళ్లేందుకు తెలంగాణ రాష్ట్రం ఒప్పుకొందని ఆయన తెలిపారు. గుంటూరు, ప్రకాశం జిల్లాలలకు తాగు నీటి అవసరాల కోసం ఈ నీటిని వినియోగించనున్నట్టుగా ఆయన చెప్పారు. సాగర్, శ్రీశైలం నుండి తమకు రావాల్సిన నీటి కేటాయింపులను వాడుకుం టున్నట్టుగా చెప్పారు. కాగా... ఈ జీవోపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కృష్ణా, గోదావరి నదులపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా నిర్మిస్తున్న ప్రాజెక్టులపై ఏపీ ప్రభుత్వం కృష్ణా, గోదావరి బోర్డులకు ఫిర్యాదు చేసింది. ఈ ప్రాజెక్టుల విషయమై తెలంగాణ ప్రభుత్వాన్ని కృష్ణా, గోదావరి బోర్డులు వివరణ కోరాయి. పోతిరెడ్డిపాడుపై ఏపీ ప్రభుత్వాన్ని తెలంగాణ ఫిర్యాదు ఆధారంగా కృష్ణా బోర్డు వివరణ కోరింది.

దేశంలో ఆందోళన కలిగిస్తున్న కరోనా కేసులు

లాక్‌డౌన్ సడలింపులతో పెరుగుతున్న పాజిటివ్‌లు

అప్రమత్తంగా ఉండాల్సిందే అంటున్న వైద్యులు

న్యూఢిల్లీ,మే22(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా కేసులు విపరీతంగా పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. లాక్‌డౌన్ నిబంధనలు సడలించడంతో కేసుల సంఖ్య పెరుగుతోంది. అయితే టెస్టులు విస్తృతంగా చేస్తే వీటి సంఖ్య మరింత బయటపడగలదని భావిస్తున్నారు. మొత్తంగా ఇండియాలో కరోనా కేసులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా కరోనా కేసులు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత వారం రోజులుగా కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కేసులు పెరుగుతున్న సమయంలో సడలింపులు ఇవ్వడం కేసులు పెరిగేందుకు మరొక కారణం అవుతున్నది అనడంలో

సందేహం అవసరం లేదు. తాజా సమాచారం ప్రకారం గత 24 గంటల్లో ఇండియాలో 6088 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో ఇండియాలో మొత్తం కేసుల సంఖ్య 1,18,447 కేసులు నమోదుకాగా, 3,583 మంది మరణించారు. రోజురోజుకు కేసుల సంఖ్య పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఇక ఇదిలా ఉంటె ప్రపంచంలో కూడా కరోనా కేసులు భారీగా పెరిగుతున్నాయి. గత 24 గంటల్లో లక్ష కేసులు నమోదయ్యాయి. ఒక్క రోజులో ఇన్ని కేసులు నమోదు కావడం ఇదే మొదటిసారి. మొత్తం మీద ఇప్పటి వరకు 51.32 లక్షల కేసులు నమోదు కాగా, 3.34 లక్షల మందికి పైగా మరణించారు. అమెరికా, రష్యాలో అత్యధికంగా కేసులు నమోదవుతున్నాయి. ఇకపోతే గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 6088 కరోనా కేసులు నమోదయ్యాయి. దేశంలో ఒక్కరోజు వ్యవధిలో ఇంత పెద్ద మొత్తంలో కరోనా కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి కరోనా వల్ల గురువారం దేశవ్యాప్తంగా 148 మంది చనిపోయారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 1,18,447కి చేరింది. ప్రస్తుతం దేశంలో 66,330 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. అదేవిధంగా చనిపోయిన వారి సంఖ్య 3583కి చేరినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ హెల్త్ బులిటెన్ విడుదల చేసింది. కరోనా నుంచి కోలుకుని ఇప్పటివరకు 48,553 మంది డిశ్చార్జ్ అయ్యారు.

మహారాష్ట్రలో 2345 కరోనా కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్రలో ఒకే రోజులో ఇన్ని కేసులు నమోదకావడం ఇదే మొదటిసారి. దాంతో మహారాష్ట్రలో కరోనా బాధితుల సంఖ్య 41,600 దాటింది. అలాగే గురువారం 64 మంది చనిపోవడంతో.. మహారాష్ట్రలో కరోనా మరణాలు 1454 చేరాయి.

హైదరాబాద్: దేశంలో నోవెల్ కరోనా వైరస్ కేసులు రోజు రోజూ అధికం అవుతున్నాయి. గత 24 గంటల్లో రికార్డు స్థాయిలో పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. దేశవ్యాప్తంగా 6088 కొత్త కేసులు నమోదు అయినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. దేశంలో ఒక్క రోజులో అత్యధిక స్థాయిలో కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి. దీంతో ఇండియాలో పాజిటివ్ కేసుల సంఖ్య 1.18 లక్షలకు చేరుకున్నది. ఇప్పటి వరకు మన దేశంలో కరోనా వల్ల మృతిచెందిన వారి సంఖ్య 3583గా ఉన్నది. గత 24 గంటల్లో 148 మంది కరోనా వైరస్ వల్ల ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు మహారాష్ట్ర ప్రభుత్వం కొత్త నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు హాస్పిటళ్లలో ఉన్న 80 శాతం బెడ్‌లను ఆగస్టు 31 వరకు బుక్ చేసుకున్నది. ఎపిడమిక్ డిసీజ్ చట్టం కింద మహా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ చట్టంతో ప్రైవేటు ఆస్పత్రి బెడ్‌లను ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకుంటుంది. చికిత్స బిల్లులపై ప్రభుత్వమే ధరలను ఫిక్స్ చేసింది. తమిళనాడులో గత 24 గంటల వ్యవధిలో 776 మంది కరోనా బారిన పడటంతో.. మొత్తం బాధితుల సంఖ్య 13,900 దాటింది. గుజరాత్‌లోనూ కరోనా కేసుల సంఖ్య 12,910కి చేరింది. గుజరాత్‌లో నిన్న 24 మంది చనిపోయారు. ఢిల్లీలో 571 కొత్త కేసులు నమోదు కావడంతో .. దేశ రాజధానిలో బాధితుల సంఖ్య 11,600 దాటింది. రాజస్థాన్‌లో 212, మధ్యప్రదేశ్‌లో 246 కొత్త కేసులు నమోదయ్యాయి. వలస కూలీల రాకతో ఉత్తర్ ప్రదేశ్, బీహార్, ఒడిషా, జార్ఖండ్‌లలో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. గురువారం ఉత్తరప్రదేశ్‌లో 340 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. బీహార్‌లో నిన్న ఒక్కరోజే రికార్డ్ స్థాయిలో 211 మందికి కరోనా సోకింది. ఇందులో ఎక్కువ మంది వలస కూలీలే కావడం గమనార్హం. ఒడిషాలో గత 24 గంటల్లో 51 మందికి వైరస్ సోకడంతో .. ఆ రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య 1003కి చేరింది. కర్ణాటకలో మళ్లీ కేసులు పెరుగుతున్నాయి. గత 24 గంటల్లో కర్ణాటకలో 143 కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో కర్ణాటకలో మొత్తం కేసుల సంఖ్య 1600 దాటింది. దీంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైద్య ప్రముఖులు హెచ్చరిస్తున్నారు.

లాక్‌డౌన్ నుంచి బయటకు వచ్చిన ప్రధాని మోడీ

బెంగాల్ తుఫాన్ బీభత్సంపై ఏరియల్ సర్వేకు రాక

న్యూఢిల్లీ,మే22(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో అధికారిక నివాసం నుంచే పాలన సాగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ 83రోజుల తర్వాత మొట్టమొదటిసారి ఇంటి నుంచి కాలు బయటపెట్టారు. ఇంతకాలం వీడియో కాన్ఫరెన్స్‌లు, రేడియో ప్రసంగాలకే పరిమితం అయిన ఆయన బెంగాల్ పర్యటనకు వెళ్లారు. 'ఆంఫన్' తుపాన్ ప్రభావం వల్ల పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆంఫన్ తుపాన్ బీభత్సం సృష్టించిన నేపథ్యంలో నష్టాన్ని పరిశీలించేందుకు పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో ప్రధానమంత్రి మోదీ శుక్రవారం ఏరియల్ సర్వేకోసం కోల్‌కతా చేరుకున్నారు. కరోనా వైరస్ ప్రబలటానికి ముందు ప్రధాని మోదీ చివరిసారిగా ఫిబ్రవరి 29వతేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగరాజ్, చిత్రకూట్ ప్రాంతాల్లో పర్యటించారు. కరోనా లాక్ డౌన్ వల్ల ప్రధాని మోదీ దాదాపు మూడు నెలలపాటు ఇంటికే పరిమితమై కాలు బయటపెట్టలేదు. కరోనాను కట్టడి చేసేందుకు ఇంట్లోనే సురక్షితంగా ఉండండి అంటూ మోదీ ప్రజలకు పిలుపు ఇచ్చి తాను ఇంట్లోనే ఉంటూ మూడుసార్లు లాక్ డౌన్ పొడిగించారు. తుపాన్ సృష్టించిన బీభత్సం జాతీయ అత్యవసర పరిస్థితి కావడంతో ప్రధాని మోదీ కోల్ కతా, 24 పరగణాస్ ప్రాంతాల్లో పర్యటించనున్నారు. తుపాన్ ప్రభావ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేసిన ప్రధానమంత్రి సహాయ పునరావాస పనుల గురించి సమీక్షించనున్నారు. తుపాన్ ప్రభావం వల్ల 80 మంది మరణించడం తోపాటు పలు ప్రాంతాల్లో వంతెనలు కొట్టుకుపోయాయి. విద్యుత్, టెలికం రంగా నికి తుపాన్ వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. స్వయంగా ప్రధాని పర్యటించాలని సిఎం మమతా బెనర్జీ కూడా కోరడంతో ఉదయం ఆయన కోల్‌కతా చేరుకోగా సిఎం మమతా బెనర్జీ, గవర్నర్ ప్రధానికి స్వాగతం పలికారు.

రిజర్వు బ్యాంక్ మరో కీలక నిర్ణయం

ఇఎంలపై మరో మూడు నెలల మారటోరియం

రెపోరేటు 4.4 శాతం నుంచి 4 శాతానికి తగ్గింపు

రివర్స్ రెపోరేటు 3.35శాతానికి కుదింపు

డబ్బు అందుబాటులో ఉండేందుకు ఈ చర్య

మీడియా సమావేశంలో వెల్లడించి గవర్నర్ శక్తికాంత్ దాస్

ముంబై,మే22(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ కొనసాగుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ మరోమారు కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ఈఎంఐలపై ఇచ్చిన మూడు నెలల మారటోరియాన్ని ఇప్పుడు మరో మూడు నెలల వరకు మళ్లీ పొడిగించింది. మారటోరియాన్ని మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నామన్ని, జూన్ ఒకటవ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ఈ మారటోరియం వర్తిస్తుందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ తెలిపారు. ముంబైలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. భవిష్యత్తును ఎదుర్కొనేందుకు ఆర్బీఐ జాగ్రత్తగా ఉందని, ఎటువంటి సవాల్ అయినా స్వీకరిస్తామని గవర్నర్ శక్తికాంత్ తెలిపారు. టర్మ్ లోన్లకు అదనంగా 90 రోజుల ఎక్స్‌టెన్షన్ ఇస్తున్నామన్నారు. టర్మ్ లోన్లపై మూడు నెలల మారిటోరియాన్ని పొడిగిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. లాక్‌డౌన్ పొడగింపు వల్ల ఈ నిర్ణయం తప్పదంలేదన్నారు. కరోనా వైరస్ వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదన్నారు. రెపో రేటును 40 బేసిస్ పాయింట్లు తగ్గించామని, దీంతో రెపో రేటు 4.4 శాతం నుంచి 4 శాతానికి చేరుకున్నట్లు చెప్పారు. దీని వల్ల ఈఎంఐలో తీసుకున్న రుణాలపై భారం తగ్గనున్నది. కోవిడ్19 సంక్షోభం నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ఊహాచిత్రాన్ని ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. రివర్స్ రెపో రేటును 3.35 శాతానికి తగ్గించినట్లు చెప్పారు. భారత్ ఆర్థికంగా మళ్లీ గాడిలో పడుతుందన్న విశ్వాసం కలిగి ఉండాలని శక్తికాంత్ దాస్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది వాణిజ్యం సుమారు 13 నుంచి 32 శాతానికి పడిపోయే అవకాశాలు ఉన్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ తెలిపారు. ప్రైవేటు సంస్థల వినియోగం దారుణంగా పడిపోయినట్లు ఆయన చెప్పారు. కీలకమైన పరిశ్రమల ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గిందన్నారు. కరోనా సంక్షోభ సమయంలో ఒక్క వ్యవసాయంపైనే ఆశలు పెట్టుకున్నట్లు శక్తికాంత్ తెలిపారు. రుతుపవనాలపై కేంద్ర వాతావరణశాఖ ఇస్తున్న సమాచారం వ్యవసాయం రంగంపై మరింత ఆశలను రేపుతున్నట్లు ఆయన చెప్పారు. ఆహార ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 8.6 శాతానికి చేరినట్లు చెప్పారు. దేశంలో పరిశ్రమల ఉత్పత్తి మార్చి నెలలో 17 శాతం పడిపోయిందన్నారు. కీలక పరిశ్రమల ఔట్‌పుట్ 6.5 శాతానికి తగ్గినట్లు తెలిపారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధిత రంగాలు మాత్రమే ఆశాజనకంగా ఉన్నాయని, ఆహార ఉత్పత్తులు 3.7 శాతం పెరిగినట్లు చెప్పారు. భారత విదేశీ మారక విలువలు 2020-21 సంవత్సరానికి 9.2 బిలియన్లు పెరిగినట్లు తెలిపారు. 2020-21 సంవత్సరానికి జీడీపీ వృద్ధి నెగటివ్ క్యాటగిరీలోనే ఉంటుందన్నారు. రెండవ అర్థభాగంలో పుంజుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. రెపో రేటు 40 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ ప్రకటించారు. శుక్రవారం ప్రెస్‌మీట్ నిర్వహించిన ఆయన పలు కీలక విషయాలను వెల్లడించారు. రెపో రేటు 4.40 నుంచి 4 శాతానికి తగ్గించినట్లు పేర్కొన్నారు. రివర్స్ రెపోరేటు 3.35శాతానికి కుదిస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకుల్లో ఉందని, ఆర్థికరంగ అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో సిమెంట్, ఉక్కు పరిశ్రమలపై ప్రతికూల ప్రభావం పడిందని ఆయన చెప్పారు. లాక్‌డౌన్ కాలంలో సిమెంట్ ఉత్పత్తి 25శాతం తగ్గిందని, పెట్టుబడుల ప్రవాహంపై తీవ్ర ప్రభావం పడిందని శక్తికాంత్‌దాస్ వెల్లడించారు.

మార్చిలో పారిశ్రామిక ఉత్పత్తి 15శాతం పడిపోయిందని, ఏప్రిల్‌లో తయారీరంగంలో ఎన్నడూ లేనంత క్షీణత కనిపించిందని పేర్కొన్నారు. దేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగిందని దాస్ ప్రకటించారు. వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెరిగిందని, వ్యవసాయ రంగానికి మరిన్ని ప్రోత్సాహకాలు కల్పించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ద్రవ్యోల్బణం అంచనా వేయడం క్లిష్టంగా మారిందని శక్తికాంత్‌దాస్ చెప్పారు.

ఆర్థిక మందగమనంతో ప్రభుత్వ ఆదాయాలు దెబ్బతిన్నాయని, మరిన్ని నిధులు అందుబాటులో ఉంచేందుకు రెపో రేటు తగ్గించామని ఆయన స్పష్టం చేశారు. రుణాలపై మారటోరియం మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు మారటోరియం పొడిగిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి

హైదరాబాద్,మే22(ఆర్ఎన్ఎ): మూర్ఛవచ్చి ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ నూతన భవనం సమీపం సందులోని ఓ అరుగుపై ఉదయం ఓ వ్యక్తి పడి ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి అతడిని పరీక్షించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు.

అతని వివరాలు సేకరించగా.. ఎంఎం పహాడీకి చెందిన ఆటో డ్రైవర్ సల్మాన్ ఖాన్ (25)గా గుర్తించారు. ఫిట్స్‌తోనే అతను మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఉస్మానియా మార్చురీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బెంగాల్‌కు వేయికోట్ల సాయం ప్రకటించిన ప్రధాని

మరణించిన వారి కుటుంబాలకు 2లక్షల చొప్పున సాయం

అన్ని విధాలా కేంద్రం అండగా ఉంటుందని అభయం

తుపాన్‌తో దెబ్బతిన్న ప్రాంతాల్లో ఏరియల్ సర్వే

నష్టం వివరాలు వెల్లడించిన సిఎం మమతా బెనర్జీ

కరోనాతో నేరుగా ప్రజలను కలుసుకోలేక పోయిన మోడీ

కోల్‌కతా,మే22(ఆర్ఎన్ఎ): పశ్చిమబెంగాల్‌కు అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రధాని మోడీ ప్రకటించారు. తోణ సాయంగా వేయికోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ముఖ్యమంత్రి మమత బెనర్జీ నేతృత్వంతోని ప్రభుత్వం తక్షణ సహాయక చర్యలను అభినందించారు. అంఫాన్ తుఫాను ధాటికి తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో ప్రధాని నరేంద్రమోదీ ఏరియల్ సర్వే నిర్వహించారు. అంఫన్ తుఫాన్ వల్ల పశ్చిమ బెంగాల్ అతలాకుతలమైంది. బెంగాల్లో తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను ప్రధాని మోడీ.. బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో కలిసి ఏరియల్ సర్వే నిర్వహించి పరిశీలించారు. తుఫాన్ వల్ల బెంగాల్లో 80 మంది చనిపోవడం బాధాకరమని మోడీ అన్నారు. తుఫాన్ వల్ల చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షల ఆర్థికసాయం ప్రకటిస్తున్నట్లు మోడీ తెలిపారు. తుఫాన్ ధాటికి బెంగాల్ తీవ్రంగా నష్టపోయిందని ఆయన అన్నారు. బెంగాల్‌కు వెయ్యి కోట్ల ఆర్థికసాయం ప్రకటిస్తున్నట్లు మోడీ ప్రకటించారు. తుఫాన్ నష్టాన్ని సీఎం మమతా బెనర్జీ వివరించారని ఆయన అన్నారు. కరోనా కంటే అంఫన్ తుఫానే భయంకరంగా ఉందని సీఎం మమతా అన్నారని మోడీ తెలిపారు. తుఫాన్ ప్రభావం నుంచి బెంగాల్ త్వరలోనే కోలుకుంటుందని ఆయన తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో త్వరలోనే కేంద్ర బృందం పర్యటిస్తుందని ఆయన అన్నారు. బెంగాల్‌కు కేంద్రం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. బాధితులను కలుసుకోవాలన్న కరోనా కారణంగా నేరుగా కలుసుకోలేక పోతున్నానని ప్రకటించారు. తుఫాను ధాటికి దెబ్బతిన్న ప్రాంతాల్లో కలియతిరుగుతూ ఏరియల్ సర్వే చేపట్టారు. అంఫాన్ వల్ల నష్టంపై ప్రధాని మోదీ ఏరియల్ సర్వే, సమీక్షల ద్వారా భారీ నష్టం జరిగిందన్న అంచనాకు వచ్చారు. ప్రధాని మోదీ వెంట సీఎం మమతా బెనర్జీ కూడా ఉన్నారు. అంఫాన్ విలయ తాండవానికి ఇప్పటివరకు బెంగాల్ లో 80 మంది మృతి చెందారు. ఒడిశాలో ఇద్దరు మృతి చెందారు. 44.8 లక్షల మంది ప్రభావితమయ్యారు. బంగ్లాదేశ్‌లో 10 మంది మృతి చెందారు. తీవ్రంగా ఆస్తి నష్టం కూడా జరిగింది. అంతకుముందు ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బెంగాల్ కు చేరుకున్నారు. కోల్‌కతా ఎయిర్ పోర్టులో ప్రధాని మోదీకి సీఎం మమతాబెనర్జీ స్వాగతం పలికారు. ప్రధాని వెంట కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్ , బాబుల్ సుప్రియో, ప్రతాప్ చంద్ర సారంగి, దేవశ్రీ చౌదరి ఉన్నారు. ఇదిలావుంటే అంఫాన్ తుఫాను ధాటికి తీవ్రంగా నష్టపోయిన పశ్చిమ బెంగాల్‌కు మద్దతుగా నిలుస్తోన్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ఆ రాష్ట్ర సీఎం మమతాబెనర్జీ కృతజ్ఞతలు తెలియజేశారు. అంఫాన్ విలయ తాండవం సృష్టించిన నేపథ్యంలో తనకు ఫోన్ చేసి రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నందుకు రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపారు. అంఫాన్ వల్ల తీవ్రంగా నష్టపోయిన బెంగాల్‌కు యావత్ జాతి అండగా ఉంటుందని ప్రధాని మోదీ ఇప్పటికే ప్రకటించారు.

ఖాజాగూడ చెరువును సుందరంగా తీర్చిదిద్దాలి

పరిసరాలను పరిశీలించిన మంత్రి కెటిఆర్

నగరంలో ట్రాఫిక్ ఫ్రీగా మారేలా ఫ్లైఓవర్లు

హైదరాబాద్,మే21(ఆర్ఎన్ఎ): నగరంలోని ఖాజాగూడ చెరువుతో పాటు దాని పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్.. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మేయర్ బొంతు రామ్మోహన్‌కు సూచించారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాజెక్టుకు సంబంధించి మరిన్ని వివరాలు మీ ముందు ఉంచుతానని కేటీఆర్ ట్వీట్ చేశారు.

ఖాజాగూడ చెరువు పరిసరాలను ఎమ్మెల్యే గాంధీ, మేయర్ రామ్మోహన్‌తో కలిసి కేటీఆర్ పరిశీలించారు. అలాగే వివిధ కార్యక్రమాల్లో కెటిఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత ముంబయి హైవేను రోడ్ నం-45, ఖాజాగూడ, ప్రశాసన్ నగర్ వరకు అనుసంధానించే లింక్ రోడ్ల పురోగతిని కేటీఆర్ అధికారులతో కలిసి పరిశీలించారు. నగరంలో 40కి పైగా లింక్ రోడ్ల పనులు యుద్ధప్రతిపాదికన జరుగుతున్నాయని కేటీఆర్ చెప్పారు. హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ కింద ఈ లింక్ రోడ్డు పనులు జరగడం సంతోషంగా ఉందన్నారు. ఇదిలావుంటే బయోడైవర్సిటీ జంక్షన్‌లో 30.26 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫస్ట్‌లెవల్ ఫ్లై ఓవర్‌ను కెటిఆర్ గురువారం ప్రారంభించారు. హైదరాబాద్ నగరానికి తలమానికంగా దినదినాభివృద్ధి చెందుతున్న ఐటీ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏరియాలో పెరుగుతున్న వాహనాల రద్దీతో తరచూ నిలిచిపోతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి ఎస్ఆర్‌డిపి ప్యాకేజీ కింద రూ. 37.9 కోట్లతో ఆరు పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటిలో ఐదు పనులు గతంలోనే పూర్తిచేశారు. ఈ ప్యాకేజీలో చివరిదైన ఫస్ట్‌లెవల్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించడంతో జెఎన్‌టియు నుంచి బయోడైవర్సిటీ వరకు దాదాపు 12కి.మీ. కారిడార్‌వినియోగంలోకి వచ్చి ట్రాఫిక్ ఫ్రీ ఫ్లోకు వెసులుబాటు కలిగింది. ఎస్ఆర్‌డిపి ప్యాకేజీ 4 పనులతో ఈ ప్రాంతం అంతర్జాతీయస్థాయి నగరాలకు ధీటుగా కనిపిస్తుంది. ఎస్ఆర్‌డిపి ప్యాకేజీ కింద నిర్మించిన రాజీవ్‌జంక్షన్ మెజెస్టిక్ షాపింగ్ మాల్ నుంచి మలేషియన్ టౌన్‌షిప్ వరకు 97.93 కోట్లతో 1230 మీటర్ల పొడవున నిర్మించిన పనులు 2019, ఏప్రిల్‌లో పూర్తయ్యాయి. దీంతో జెఎన్‌టియు వద్ద ట్రాఫిక్‌సమస్య తొలగిందని అధికారులు తెలిపారు. అయ్యప్ప సొసైటీ జంక్షన్ వద్ద అండర్‌పాస్‌ను 44. 30 కోట్లతో 450 మీటర్ల పొడవున అండర్‌పాస్ నిర్మించారు. 2018, జనవరిలో ఈ అండర్‌పాస్‌పనులు పూర్తిచేశారు. దీంతో కొండాపూర్ నుంచి అయ్యప్ప సొసైటీ వరకు ట్రాఫిక్‌సమస్యలు తొలగిపోయాయి. మైండ్ స్పేస్ జంక్షన్ వద్ద 80. 23 కోట్లతో నిర్మించిన ఈ ఫ్లయ్‌ఓవర్‌ను 2018, నవంబరులో పూర్తిచేశారు. దీంతో ఇనార్బిట్‌మాల్, ర్యాడిసన్ మధ్య ట్రాఫిక్ రద్దీ తగ్గింది.

ఫ్లెక్సీలు ఏర్పాటుపై కెటిఆర్ ఆగ్రహం

జూబ్లీహిల్స్ పరిధిలో బస్తీదవానా ప్రారంభం

హైదరాబాద్ ,మే22(ఆర్ఎన్ఎ): తనకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన నాయకుల తీరుపై మంత్రి కేటీఆర్ అసహనం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై కేటీఆర్ మండిపడ్డారు. ఎర్రగడ్డ కార్పొరేటర్ షాహీన్ బేగంకు రూ.20వేల జరిమానా వేయాలని అధికారులకు సూచించారు. మాస్క్ లేకుండా వచ్చినందుకు కార్పొరేటర్ భర్త షరీఫ్‌కు రూ.వెయ్యి జరిమానా వేయాలన్నారు. కార్పొరేటర్ దంపతులకు జరిమానా విధించాలని జీహెచ్ఎంసీ అధికారులను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డలోని యాదగిరి నగర్, సుల్తాన్ నగర్ బస్తీల్లో మంత్రి కేటీఆర్ బస్తీ దవాఖానలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ బొంతు రామ్మోహన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా వైద్యం: తలసాని

ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకే బస్తీ దవాఖానాలు ఏర్పాటుచేసినట్టు పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. శుక్రవారం సనత్‌నగర్ నియోజక వర్గం పరిధిలోని మోండా మార్కెట్ డివిజన్ చాపలబాయి, నాలాబజార్, గోషామహల్ నియోజక వర్గంలోని అబిడ్స్, కామాటి పురాలో ప్రభుత్వ విప్ ప్రభాకరరావుతో కలిసి నూతనంగా ఏర్పాటుచేసిన బస్తీ దవాఖానాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. లక్షలాది రూపాయలు ఖర్చుచేసి పేద, మధ్య తరగతి ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్స్‌లో సరైన వైద్యం చేయించుకోలేక పోతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఆలోచనల మేరకు అలంటి వారి ఆరోగ్య పరిరక్షణకు ఏర్పాటుచేసిన బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు ఆకుల రూప, మమతాగుప్తా, ముఖేష్‌సింగ్, సెంట్రల్‌జోన్,నార్త్‌

పేదరిక నిర్మూలనకై చేపట్టేదిగా కొనసాగాలి..

నేటినిజం
శనివారం 23-5-2020

రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. కొన్ని దేశాలకే పరిమితమైన పారిశ్రామికాభివృద్ధి ప్రపంచీకరణ నేపథ్యంలో పలు దేశాలకు వ్యాప్తి చెందింది. వలస పాలనల నుండి పురుడు పోసు కున్న ఎన్నో దేశాలు అభివృద్ధి అనే పేరుతో బహుళజాతి సంస్థలకు స్వాగతం పలికి ప్రపంచీకరణలో భాగమైనాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అభివృద్ధి అంటే దేశంలో ఒక వర్గం ఆకర్షణీయమైన బహుళ అంతస్తుల అద్దాల భవనాలు నిర్మించి, ఆర్థికపరమైన వ్యత్యాసాలతో శ్రమదోపిడీకి పాల్పడటం సరైనది కాదు. పేదవర్గానికి చెందిన అత్యధిక శాతం ప్రజలకు కనీసా వసరాలను తీరుస్తూ,వారిని అభివృద్ధి పథం వైపు పయనించేలా చేయడమే నిజమైన అభివృద్ధి. కానీ ఈ బహుళజాతి సంస్థలు పేదలపట్ల ఎలాంటి మేలు చేకూర్చిందంటే జవాబులేని ప్రశ్నగానే మిగిలిపోతుందనడంలో అబద్ధం లేదు. ఏదైనా ఒక దేశం ఒక మల్టీనేషనల్ కంపెనీకి సాదరంగా ఆహ్వానం పలుకుతుందంటే ఒకే ఒక కారణం అభివృద్ధి. మల్టీ నేషనల్ కంపెనీ అంటే ప్రపంచం లోని పలు దేశాలను అనుసంధానంగా చేసుకొని, తక్కువ ధరలకు లభించే వనరులననుసారంగా తమ కార్యకలాపాలను కొనసాగించి, తక్కువ వ్యయంతో ఎక్కువ లాభార్జనకై పాటు పడతారు.

ముఖ్యంగా ఇలాంటి పెట్టుబడిదారులు తమ పెట్టుబడిని ఖనిజాలను వెలికితీయడం, పెట్రోలియం, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, ఇంజినీరింగ్, రసాయనాల తయారీ, గనుల తవ్వకం, నూనెతోటల పెంపకం లాంటి రంగాలలో పెట్టడం జరుగుతుంది. ఇలాంటి కంపెనీల వల్ల ద్వంద్వ ఆర్థిక నిర్మితాలు తీవ్రతరమవుతాయి. అంతేగాకుండా ముఖ్యమైన వనరులను ఆయా దేశాలకవసరమైన ఉత్పత్తుల కోసం గాకుండా విదేశీయుల అవసరాల కొరకు స్వదేశీ ధనికుల వినియోగ నిమిత్తం తరలించడం జరుగుతుంది. దీనివల్ల గ్రామీణ పట్టణ ప్రాంతాల మధ్య అసంతులనం ఏర్పడి, గ్రామీణ ప్రజలు పట్టణాలకు వలసలు పోవడానికి దారి తీస్తుంది. మరి కొన్ని కంపెనీలు ప్రపంచ దేశాలకు అవసరంలేని వస్తువుల ఉత్పత్తి గావించి, వాటిని విక్రయించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని రకరకాల ప్రకటనల ద్వారా ధనిక వర్గాన్ని ఆకర్షించి అనవసర వినియోగానికి బీజం పోసి ప్రోత్సహిస్తాయి. అదేవిధంగా స్థానికులకు ఎలాంటి లాభం లేకుండా అక్కడి వనరులను మరొక చోటికి తరలించి వారిరువురి మధ్య చిచ్చు బెడుతుంది. అలాగే కొన్ని సందర్భాలలో రాజకీయ నిర్ణ యాలలో ప్రముఖ పాత్ర వహించి ఆయా దేశాల ఆస్తులపై గుత్తాధిపత్యాన్ని చేజిక్కించుకుంటాయి. బహుళజాతి కంపెనీల వ్యవస్థాపకుల వద్ద అపారమైన ఆర్థిక వనరులుంటాయి.

ఇవి అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు పొంది, పలు దేశాల్లోని మార్కెట్లు సైతం అందుబాటులో ఉండి, తమ సరుకులను చక్కగా అమ్ముకునే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ప్రపంచ వ్యాప్తంగా ఏ మూల ఏ సరుకు ఎంతకు అమ్ముడవుతుందో, ఏ సరుకు కొరత ఎంత ఉందో క్షణాల్లో తెలుసుకుంటూ, దానికనుగుణంగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తాయి. టీవీలలో వ్యాపార ప్రకటనల కోసం అధిక వ్యయాన్ని హెచ్చించి, మానసికంగా కొనుగోలుదారుని అభిరుచిని ప్రభావితం చేసి కొనేలా చేస్తుందనడంలో ఎలాంటి సందేహం అక్కరలేదు. అదేవిధంగా వీటికి పరిశోధన అభివృద్ధి సౌకర్యాలుండి, ఎప్పటికప్పుడు వినియోగదారులలో వచ్చే మార్పులను గమనించి, వారిని సంతృప్తిపరచటానికి కొత్త ఉత్పత్తులను సృష్టిస్తూ వ్యాపారం చేస్తుంటాయి. ఈ విషయంలో మల్టీ నేషనల్ కంపెనీలు తయారైన సరుకులను ధరలు తగ్గించి, స్వదేశీ కంపెనీలు మూతబడటానికి దోహదపడి, ఆ తర్వాత క్రమేణ ధరలను పెంచుతూ, తమకెవ్వరూ సాటిలేరని, తమ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నాయనడంలో అవాస్తవం లేదు. అలా గాకుండా మల్టీనేషనల్ కంపెనీలతో పోటీని ఎదుర్కోలేక స్వదేశీ కంపెనీలు ఆయా కంపెనీలు ఒప్పందం కుదుర్చుకుంటే, అది అమలులో ఉన్నప్పుడేగాక, ఒప్పందం గడువు ముగిశాక కూడా తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతరులకు అమ్ముకోకూడదని శాసిస్తాయి.

అలాగే అవి నిర్దేశించిన గరిష్ట ధరలకే సరుకులను తయారుచేయాలని ఆదేశాలు జారీచేస్తాయి. మరీ ముఖ్యంగా అడవులు, నదులున్న చోటుని ఎంచుకొని అడవుల వినాశనానికి పాటుపడు తూ వాటిపై ఆధారపడి జీవించేవారిని నిర్వాసితులను చేసి, పొట్ట కొట్టిన సందర్భాలలో వెలుగెత్తిన సామాజిక ఉద్యమాలను చరిత్ర పుటలలో నిగూఢమైన విషయం అందరికీ తెలిసిందే. సమాజాభివృద్ధికై పాలకులు చేపట్టే ఏ కార్యక్రమమైనా పేదల పక్షాన నిలిచి వారి పురోగతిని కాంక్షించి, పేదరిక నిర్మూలనకై చేపట్టేదిగా కొనసాగాలి. ఆర్థిక సమతుల్యా న్ని పాటించి, అట్టడుగు ప్రజల అభ్యున్నతికి పాటుపడాలి. ఆకలిచావులు అనే మాట ఎక్కడా వినిపించకుండా గమనించుకోవాలి...!

ఫెన్సింగ్ వైరులో చిక్కుకొని చిరుతపులి మృతి

రెండు వారాల్లో నాలుగు చిరుతల మృత్యువాత

న్యూఢిల్లీ,మే22(ఆర్ఎన్ఎ): ఫెన్సింగ్ వైరులో చిక్కుకున్న ఓ చిరుతపులి మరణించిన ఘటన ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని కుమావున్ అటవీ డివిజన్‌లో వెలుగుచూసింది. కుమావున్ అటవీ డివిజనులో గత రెండు వారాల్లో 4 చిరుతపులులు మరణించాయి. అటవీ గ్రామ ప్రజల సమాచారం మేర అటవీశాఖ అధికారులు బగేశ్వర్ జిల్లాలోని కపోట్ ప్రాంతంలోని కుంజడి నల్లా వద్దకు వచ్చారు. ఫెన్సింగ్ వైరులో చిరుతపులి చిక్కుకున్నట్లు గుర్తించి దాన్ని రేంజ్ కార్యాలయానికి తీసుకువచ్చి పశువైద్యులతో పరీక్షించగా అప్పటికే మరణించిందని కపోట్ రేంజ్ ఆఫీసర్ మనీష్ కుమార్ చెప్పారు. చిరుతపులి తీవ్ర గాయం వల్లనే అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణించిందని వైద్యులు చెప్పారు. చిరుతపులి కళేబరాన్ని దహనం చేశారు. అల్మోరా జిల్లా చౌఖుటియా ప్రాంతంలో రోడ్డుపై గతంలో చిరుతపులి కళేబరం కనిపించింది. ఉత్తరాఖండ్ మే 12వతేదీన రెండు చిరుతలు మరణించాయి. నైనిటాల్ లోని జ్యోలికోట్ ప్రాంతంలో ఐదేళ్ల వయసుగల చిరుతపులి కళేబరం దొరికింది. మే 14వతేదీన సోమేశ్వర్ లోని బజైలీ గ్రామంలో చిక్కుకున్న చిరుతను కాపాడిన అధికారులు దాన్ని అడవుల్లో వదిలేశారు.

తాగుబోతు కొడుకును హత్య చేసిన తండ్రి

పెద్దపల్లి,మే22(ఆర్ఎన్ఎ): తాగుడుకు బానిసై నిత్యం కుటుంబ సభ్యులను వేధిస్తున్న తనయుడిని ఓ తండ్రి హత్య చేసాడు. ఈ ఘటన జిల్లాలోని రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఇందిరానగర్‌లో చోటు చేసుకుంది. ఇందిరానగర్‌లో నివాసముండే నడిగోట్టు మల్లయ్య రజక వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. తన కుమారుడు గణేష్ (35) నిత్యం మద్యం తాగి ఇంట్లో గొడవ చేస్తుండేవాడు. అతడి ఆగడాలు భరించలేక గణేష్ భార్య స్వరూప 2 సంవత్సరాల క్రితం భర్తను వదిలేసి వెళ్లిపోయింది.. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం సేవించి ఇంట్లో గొడవ పడటంతో ఆగ్రహించిన తండ్రి కుమారుడిపై సిమెంట్ ఇటుకతో దాడి చేయగా గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోతిరెడ్డిపాడుపై ఇద్దరిదీ నాటకమే: జగ్గారెడ్డి

జగిత్యాల,మే22త(ఆర్ఎన్ఎ): తెలంగాణ వచ్చినందుకు సంతోషపడాలో, కేసీఆర్ లాంటి వ్యక్తి సీఎం అయినందుకు బాధ పడాలో అర్థం కావడం లేదని కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు . పోతిరెడ్డిపాడు విషయంలో కేసీఆర్, ఏపీ సీఎం జగన్ కలిసి నాటకాలు ఆడుతున్నారని అన్నారు. ప్రాజెక్టు విషయంలో జగన్ కు ఎందుకు సహకరిస్తున్నారని జగ్గారెడ్డి ప్రశ్నించారు. జగన్ కు ఎన్నికల్లో పెట్టుబడి పెట్టింది కేసీఆర్ కాదా ..? అని అడిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రెండు పంటలకు నీళ్ళు ఇవ్వగలిగే స్థితిలో ఉంటే కంది పంట ఎందుకు సాగు చేయాలన్నారు జగ్గారెడ్డి. ÷రిళిటి మెట్రిక్ టన్నుల వరి పండిందని చెబుతున్న కేసీఆర్ ఇప్పటివరకు వాటిలో 47 శాతం కూడా కొనలేదని అన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. టీఆర్ఎస్ కు ముగింపు పలికేది కాంగ్రెస్ పార్టీనే అని అన్నారు. మాజీమంత్రి దశదినకర్మలో పాల్గొనేందుకు ఇక్కడికి వచ్చారు.

టూవీలర్‌ను ఢీకొన్న వెహికల్: వ్యక్తి మృతి

మెదక్,మే22(నేటినిజం ప్రతినిధి): పెద్ద శంకరంపేటలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషాదకర సంఘటన మెదక్ జిల్లాలో 161 నంబర్ హైవే మీద అల్లాదుర్గం మండలం రాంపూర్ వద్ద జరిగింది. పెద్ద శంకరంపేట మండలం ఉత్తులూర్ గ్రామానికి చెందిన దుర్గయ్య.. అల్లాదుర్గం మండల పరిధిలో ఉన్న రాంపూర్‌లోని రైస్ మిల్లులో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం దుర్గయ్య తన మోటార్ సైకిల్ మీద రైస్ మిల్లుకు బయలుదేరాడు. మరి కొద్దిసేపట్లో రైస్ మిల్లుకు చేరుకుంటాడనగా ఎదురుగా వస్తున్న డోజర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గయ్య తల తెగి ఎగిరి దూరంగా పడింది. సంఘటన స్థలంలో మొండెం, తల వేరువేరుగా పడి ఉండటం భయానకంగా కనిపించింది. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెల పెళ్లిళ్లు కాగా, కుమారుడి పెళ్ళి చేయాల్సి ఉంది. మృతుని భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అల్లాదుర్గం పోలీసులు తెలిపారు.

తెలంగాణకు పర్యాటకులను ఆకర్షిస్తాం: శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్,మే21(ఆర్ఎన్ఎ): తెలంగాణకు పర్యాటకులను ఆకర్షించడానికి మరింతగా పర్యాటక స్థలాలను అభివృద్ధి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే పలు పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్మిస్తున్న మినీ శిల్పారామం,

మినీ టాంక్‌బండ్ ల అబివృద్ధి పై తన అధికారిక నివాసంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమం త్రి కేసీఆర్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ పట్టణాభివృద్ధి, సుందరీకరణలో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న మినీ శిల్పారామం, టాంక్‌బండ్‌ల అభివృద్ధితో పాటు పిల్లల కోసం ఆధునిక టాయ్ ట్రైన్ ఏర్పాటు పై ప్రధానంగా చర్చించారు. మినీ శిల్పారామంలో నిర్వహించే కార్యక్రమాలు, ఏర్పాటు చేసే కన్వెన్షన్ సెంటర్, స్టాళ్లు, ఫుడ్‌కోర్టులతో పాటు మినీ టాంక్‌బండ్ పరిసరాల్లో ఏర్పాటు చేసే ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌ల అభివృద్ధి, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తగిన డిజైన్‌లను, డిటేల్డ్ ప్రాజెక్ట్‌రిపోర్ట్‌ను టూరిజం శాఖఅధికారులు వారం రోజుల్లో రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలో హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో ఉన్న ఇతర ప్రాంతాలు, అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉన్నపర్యాటక ప్రదేశాల అభివృద్ధి పై కూడా చర్చించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సూచనల మేరకు తెలంగాణకు దేశీయ , వదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు పర్యాటక కేంద్రాలను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతుల కల్పన కోసం అభివృద్ధి చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పర్యాటకశాఖ ఎండి మనోహర్, టూరిజంశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు: ఇద్దరు మృతి

నారాయణపేట,మే22(ఆర్ఎన్ఎ): మద్దూరు మండలంలో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ ను ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పేరపళ్ల తండాకు చెందిన సీత్యానాయక్(70), కొత్తపల్లి తండాకు చెంది సోమ్లానాయక్ (25) పేరపళ్ల నుంచి మద్దూరుకు వస్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు ఘటనా స్థలంలో చనిపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. ట్రాక్టర్ ను పోలీస్ స్టేషన్ కు తరలించారు.

వ్యవసాయంలో మార్కెటింగే కీలకం

హైదరాబాద్,మే22(ఆర్ఎన్ఎ):వ్యవసాయంలో పంటలు పండించడం ఒక ఎత్తయితే వాటిని అమ్ముకోవడం మరో ఎత్తు. దేశంలో ఏటా రైతులు చిత్తవుతున్నది ఇక్కడే. మనదేశంలో ఆహార పదార్థాలకు డిమాండ్ ఉన్నా వాటిని ప్రజలకు చేర్చడం లో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. రైతుల నుంచి నేరుగా పంటలను ప్రజలకు తీసుకుని వెళ్లగలిగే వ్యవస్థ బలపడాలి. దానినే మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం అంటారు. ఈ ఇద్దరి మధ్య అనుసంధానం జరిగితే అటు రైతులకు, ఇటు ప్రజలకు లాభం చేకూరి దళారీ వ్యవస్థ దెబ్బతినగలదు. దీంతో ఏటా వేల కోట్లు ఆదా కాగలవు. అప్పుడు రైతులు పండించే ధాన్యం, కూరగాయలు, పళ్లు, పాడి వస్తువులు, పూలు తదితరాలు తక్కువ ధరలకు ప్రజలకు అందుతాయి. ఈ మేరకు పటిష్టమైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. దేశంలో చదువుకున్న నిరుద్యోగులు కోట్లాది మంది ఉన్నారు. వీరందరికి ఉపాధి కల్పించ వలసిన అవసరాన్ని ఈ విధంగా ఉపయోగించుకోవాలి. వారందనిని క్షేత్రస్థాయిలో పంటలను ప్రజలకు చేరవేసే చైన్‌లాగా మలచాలి. అలాగే ఆన్‌లైన్ మార్కెటింగ్ వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి. లేదా ప్రైవేట్ భాగస్వామ్యంలో వ్యవస్థీకృతం చేయాలి. అలా చేస్తే వ్యవసాయం లాభసాటి కాగలదని గుర్తించాలి. తెలంగాణలో రైతుబంధు వ్యవస్థను ఏర్పాటు చేసినా ఎక్కడ కూడా అవి రైతులను ఆదుకున్న దాఖలాలు లేవు. రైతులు ఆందోళనలు చేస్తుంటే రైతుబంధువులంతా ఏం చేస్తున్నట్లు.?రైతులు ధాన్యం అమ్ముడు పోక ఆందోళను చ ఏస్తుంటే కనీసం సమాచారం సేకరించి నేరుగా సిఎం కెసిఆర్‌కు ఎందుకు చేరవేయడం లేదు. రైతులను సంఘటిత శక్తిగా మార్చే సత్సంకల్పంతో ప్రభుత్వం రైతుబంధు సమితిలను ఏర్పాటు చేసిందని సిఎం కెసిఆర్ తొలిదశలోనే పేర్కొన్నారు. పేరుకే రైతుబంధు కాదని నిజంగానే ఈ సమితిలు రైతులకు బంధువులుగా మారాలని అభిలాషించారు. విత్తనం వేసే దగ్గర నుంచి పంట అమ్ముడుపోయే వరకు ప్రతి సందర్భంలో రైతులకు సహాయకారిగా, రైతుల మధ్య సమన్వయకర్తలుగా రైతు సమితులు వ్యవహరించా లని సూచించారు. రైతుబంధు సమితుల బాధ్యులు విస్తృతంగా పర్యటించి, రైతులకు అవగాహన కల్పించా లన్నారు. కానీ అలా ఎక్కడా జరగలేదు. వీటిని పొలిటికల్ పదవుల్లాగా అనుభవిస్తున్నారే తప్ప రైతులకు అందుబాటులో ఉండే వ్యవస్థలలుగా చూడలేదు. అలాగే ఎపిలో సచివాలయ వ్యవస్థ కూడా అంతే. ఎవరికి వారు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే సమస్యలు రావు. కానీ అలా జరగడం లేదు. అందువల్ల పాలకులు ముందు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు వ్యవస్థలను పక్కాగా ఏర్పాటు చేయాలి. పంటలను మార్చండని సిఎం కెసిఆర్ అన్న విధంగా పండించే పంటల కొనుగోళ్లకు లేదా మార్కెటింగ్‌కు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలి. అప్పుడు రైతులు ఏపంట వేసినా అమ్ముడు పోతుందన్న ధీమాతో ఉంటారు. నియంత్రిత పద్ధతిలో పంటలు సాగు చేసి, రాష్ట్రంలోని రైతులంతా వందకు వందశాతం రైతుబంధు సాయం, పండించిన పంటకు మంచి ధర పొందాలన్నది తన అభిమతమని ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ కలిగిన నాణ్యమైన పంటలు పండించడం ద్వారానే రైతులు మంచి ధర పొందగలుగుతారని వెల్లడించారు. ఏ పంట వేయడం ద్వారా మేలు కలుగుతుందనే విషయంలో వ్యవసాయశాఖ, వ్యవసాయ యూనివర్సిటీ తగు సూచనలు చేస్తుందన్నారు. దాని ప్రకారం పంట సాగు చేస్తే రైతుకు ఏ ఇబ్బంది ఉండదన్నారు. విభిన్న నేలలు, సమశీతోష్ణ వాతావరణం, మంచి వర్షపాతం, వృత్తి నైపుణ్యం కలిగిన రైతులు, రైతు పక్షపాత ప్రభుత్వం లాంటి అనుకూలతలను సద్వినియోగం చేసుకుని తెలంగాణ రైతులు ప్రపంచంతో పోటీపడే గొప్ప రైతాంగంగా మారాలని ఆకాంక్షించారు. నిజంగా ఇంత ఉదాత్తంగా సిఎం కెసిఆర్ ఆలోచన చేసినా క్షేత్రస్థాయిలో అలా జరగడం తేలిక కాదని తెలియంది కాదు.

రైతుబంధు ఇచ్చినా ఇవ్వకపోయినా పండించిన పంటలను నూరుశాతం కొనుగోలు చేసేలా రాష్ట్రస్థాయిలో వ్యవస్థను ఏర్పాటు చేయాలి. రైతుబంధు సమితులను ఏ లక్ష్యంతో ఏర్పాటు చేశారో అవన్నీ సక్రమంగా పనిచేసేలా చేయాలి. రైతులకు తాయిలాలు ఇచ్చి పంటల కొనుగోలు సందర్భం రాగానే మొహం చాటేయ రాదు. దేశంలో ఇప్పుడు జరుగుతున్నది అదే. రైతులను రాజును చేస్తామని ప్రధాని మోడీ ప్రకటించినా దేశంలో సమగ్ర వ్యవసాయ విధానం అమలు కావడం లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. ప్రజలేమో ధరలు పెరిగి నానా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. గిట్టుబాటు ధరలు రావడం లేదని రైతులు మొత్తుకుంటున్నారు. ఈ రెండంఉ సమస్యలు ఒక్కటే అని ఆలోచన చేయగలిగితే సమస్య పరిష్కారం అవుతుంది. లాక్‌డౌన్‌కు ముందు..తరవాత ధరల పరిస్థితిని ఆలోచన చేయాలి. నిజానికి దేశవ్యాప్తంగానే ఏ రాష్ట్రంలో ఏ పంట సాగుచేస్తున్నారనే లెక్కలు తీయాలి. మన దేశంలో ఉన్న జనాభాకు సరిపడా పంటల ఉత్పత్తి జరుగుతుందా లేదా అన్నది తేలాలి. ఉల్లి లోటు వస్తే ఇక అంతే సంగతులు. ఆలూకు లోటు వస్తే అంతే సంగతులు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారులు ఖచ్చితమైన వివరాలు సేకరించి, అందుకు అనుగుణంగా రాష్ట్రాలు పంటలు పండించి, వాటిని మార్కెటింగ్ చేయించే అతిపెద్ద వ్యవస్థ ఏర్పడాలి. ఇప్పుడున్న ఆన్‌లైన్ సంస్థలతో కలిపి దానిని పటిష్టం చేయాలి. అప్పుడు గ్రామాల్లో రైతుల వద్దకే వెళ్లి పంటలను ఏ రోజుకారోజు సేకరించి ప్రజలకు అనవరమైన మేరకు అందించేలా చేయగలగాలి. అప్పుడే ప్రజలకు,పంటలు పండించే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. లక్షలాది మంది యువతకు ఉపాధి దక్కుతుంది. తెలంగాణలో అమలు చేయాలనుకుంటున్న పంటల విధానం సక్రమంగా అమలు జరిగిలే సిఎం కెసిఆర్ పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇప్పుడున్నరైతుబందు వ్యవస్థను బలోపేతం చేయాలి. దానికి రాజకీయాలకు సంబంధం లేకుండా రైతులతోనే సంబంధాలు ఉండేలా చేయాలి. అప్పుడు కెసిఆర్ అభిలషించిన వ్యవసాయ విధానం దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. రైతులు కూడా పంటలను పండించి నరనమైన ధరలకు ముకోగలిగామని ఆనందిస్తారు. అలాగే తమకు సరసమైన ధరలకు నేరుగా పొలాల నుంచే వస్తువులు దక్కాయన్న ఆనందం ప్రజలకు ఉంటుంది. ఈ రకంగా వ్యవసాయం,అనుబంధరంగాలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలను బలోపతేం చేసి,మార్కెటింగ్ వ్యవస్థను పక్కాగా రూపొందిస్తే సమస్యలు శాశ్వతంగా పరిష్కరించుకోవచ్చు.

క్షేత్రస్థాయికి సిఎం కేసీఆర్ కార్యాచరణ

పంటల విధానంపై రైతులకు అవగాహన

ప్రభుత్వ భరోసా దక్కితే అభ్యంతరం లేదంటున్న రైతాంగం

హైదరాబాద్,మే22(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో నియంత్రిత పద్ధతిలో పంటసాగు విధానంపై అవగాహన కల్పించేందుకు కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ మేరకు సిఎం కెసిఆర్ ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. దీంతో క్షేత్రస్థాయిలోకి నిర్ణయాలు త్వరగా చేరనున్నాయి. ప్రగతిభవన్‌లో చర్చించి తీసుకున్న నిర్ణయాలను రైతులకు చేర్చి వారిని చైతన్య పరిచేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు అమలు చేసే అవకాశం ఉంది. దీనిపై తెలంగాణలో పలు ప్రాంతాల్లో రైతులు స్పందించారు. పంటలకుఅ సవరమైన విత్తనాలు, ఎరువుల సరఫరా చేఇస, పంటలను కొనుగోళ్లు చేయడానికి ప్రభుత్వం హామీ ఇస్తే తమకు అభ్యంతరం ఉండబోద న్నారు. తమకు మరింత భరోసా దక్కుతుందన్నారు. అందుకు తాము సిద్ధమేనని రైతులు అభిప్రాయ పడ్డారు. అందుకే రానున్న నాలుగైదు రోజుల్లోనే క్లస్టర్ల వారీగా రైతు సదస్సులు నిర్వహించాలని సిఎం కెసిఆర్ సూచించారు. ఇందులో ప్రభుత్వ ఉద్దేశాన్ని, నియంత్రిత పద్ధతిలో సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనా లను రైతులను సమగ్రంగా వివరించనున్నారు. ఏ ప్రాంతంలో ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగు చేయాలనే విషయం ముందే నిర్ధారిస్తారు కాబట్టి, ఆ పంటలకు సరిపడా విత్తనాలను ముందే గ్రామాలకు చేర్చబోతు న్నారు. విత్తన తయారీ సంస్థలతో మాట్లాడి సమన్వయం చేసుకోవడంతో పాటు సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ విషయంలో క్రియాశీలంగా వ్యవహరించనుంది. రైతుకు కావాల్సిన విత్తనాలను వందకు వంద శాతం అందుబాటులో ఉంచాలని ఇప్పటికే కెసిఆర్ ఆదేశించారు. డిమాండ్ కలిగిన పంటలు పండించడంతో పాటే నాణ్యత కలిగిన పంటలు ఉత్పత్తి చేయాలన్న లక్ష్యాన్ని రైతులకు వివరిస్తారు. అప్పుడే రైతుకు మంచి ధర వస్తుందన్నారు. వచ్చే నెల రోజుల పాటు రైతుబంధు సమితిలు ఓ యజ్ఞంలాగా ఈ కార్యక్రమం నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా రైతుబంధు అధ్యక్షుడు విస్తృతంగా పర్యటించడానికి ఒక నెల రోజుల పాటు వాహన సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిం దన్నారు. మంత్రులు, ఎంఎల్ఎలు, జెడ్‌పిచైర్మన్లు, డిసిసిబి చైర్మన్లు, డిసిఎంఎస్ చైర్మన్లు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్లు, సింగిల్ విండో చైర్ పర్సన్లు, ఎంపిటిసిలు, సర్పంచులను ఈ సదస్సులకు ఆహ్వానించనున్నారు. ఇదిలావుంటే మంచి పంగడాలు తయారు చేయడానికి, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకనేందుకు వ్యవసాయ శాఖలో రెండు కమిటీలను ప్రభుత్వం అతి త్వరలోనే నియమించనుందని సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ, రీసెర్చ్ అండ్ అనాలసిస్ కమిటీలను త్వరలో నియమించనున్నట్లు వెల్లడించారు. నియంత్రిత పద్ధతిలో పంటల సాగు చేయాలన్న నిర్ణయాన్ని రాష్ట్రంలో అత్యధిక మంది రైతులు స్వాగతిస్తున్నట్లు ఒక సర్వేలో తేలిందని సిఎం కెసిఆర్ తెలిపారు. రైతులు పండించిన పంటలకు మంచి ధర రావడం కోసమే రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందని సిఎం కెసిఆర్ తెలిపారు. అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ ప్రాసెసింగ్ సెజ్ లను ఏర్పాటు చేస్తున్నదన్నారు. ఇందులో రైసు మిల్లులు, దాల్ మిల్లులు, ఆయిల్ మిల్లులు, ఇతర ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు వస్తాయన్నారు.

కల్తీ విత్తన వ్యాపారులు రైతు ఆత్మహత్యలకు కారణమవుతున్నారని, వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలని ఆదేశించడంతో రైతుల్లో భరోసా పెరగనుంది. ముఖ్యంగా పత్తి, మిర్చి విత్తనాలను కల్తీ చేస్తున్నట్లు ప్రభుత్వానికి సమాచారం ఉంది. జిల్లాల్లో కలెక్టర్లు, పోలీసు అధికారులు సమన్వయంతో వ్యవహరించి, కల్తీ విత్తన వ్యాపారాన్ని నూటికి నూరు శాతం అరికట్టాలన్నారు. ప్రజా ప్రతినిధులెవ్వరూ కల్తీ విత్తన వ్యాపారులను కాపాడే ప్రయత్నం చేయొద్దు అని సూచించారు. వ్యవసాయ అధికారులు సూచించిన రకాలు వాడడం వల్ల మంచి దిగుబడి, ధర వస్తుందన్నారు. ప్రభుత్వమే కనీస మద్దతు ధర చెల్లించి కందులు కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.. వ్యవసాయంలో అనేక ఆధునిక పద్ధతులు, కొత్త వంగడాలు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకునే విషయంలో సాధారణ రైతులకు అంత చొరవ ఉండదు కాబట్టి మంత్రులు, రైతుబంధు సమితుల బాధ్యులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఆధునిక పద్ధతులు, కొత్త వంగడాల సాగుకు పూనుకుని ఆదర్శంగా నిలవాలన్నారు. మొత్తంగా పక్కా ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు పోతుందన్న భావన రైతుల్లో కూడా ఏర్పడనుంది. దీంతో తప్పకుండా మార్పు రాగలదని భావిస్తున్నారు.

గోడరూపంలో వచ్చిన మృత్యువు

నిద్రిస్తుండగా కూలి ముగ్గురు మృతి

నిజామాబాద్,మే22(ఆర్ఎన్ఎ): పొద్దంతా కష్టపడి అలసిపోయి సేదతీరుతున్న ఆ కుటుంబాన్నిమృత్యువు గోడ రూపంలో కబళించింది.

నిద్రలోనే వారి ఆయువు అనంతాల్లో కలిసిపోయింది. ఇంట్లో నిద్రిస్తుండగా అకస్మాత్తుగా గోడ కూలి తండ్రి శ్రినివా

ఐటి ఎగుమతుల్లో గణనీయమైన ప్రగతి

కెటిఆర్‌ను అభినందించిన సిఎం కెసిఆర్

హైదరాబాద్,మే22(ఆర్ఎన్ఎ): కరోనా కష్ట కాలంలోనూ తెలంగాణ రాష్ట్రం ఐటి ఎగుమతుల్లో మరోమారు తన సత్తా చాటింది. ఐటీ ఎగుమతుల్లో వరుసగా ఐదోసారి దేశంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాదికి గాను తెలంగాణ ఐటీ ఎగుమతుల్లో 17.93 శాతం వృద్ధిని సాధించింది. ఈ మేరకు ఐటీ వార్షిక నివేదికను ఆ శాఖ మంత్రి కేటీఆర్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గురువారం ప్రగతిభవన్‌లో సమర్పించారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఐటీ ఎగుమతుల వృద్ధి 17.93 శాతంగా ఉందని చెప్పారు. ఈ ఏడాది జాతీయ ఎగుమతుల్లో తెలంగాణ వాటా 23.5 శాతంగా ఉందని కేటీఆర్ వివరించారు. దీంతో ఐటీశాఖ మంత్రిని సీఎం కేసీఆర్ అభినందించారు. కరోనా కష్టకాలంలోనూ ఐటీ పరిశ్రమను సజావుగా నడిపించారని కితాబిచ్చారు. భవిష్యత్‌లోనూ ఇదే పట్టుదలను ప్రదర్శించాలని సీఎం సూచించారు. కాగా తెలంగాణ ఐటీ ఎగుమతులు 2018-19లో రూ. 1,09,219 కోట్లు ఉండగా.. అది 2019-20లో రూ. 1,28,807 కోట్లకు పెరిగింది. ఇక జాతియ వృద్ధి రేటు 8.9శాతంగా నమోదు అయ్యింది. ఈ కార్యక్రమంలో మంత్రులు ఈటెల రాజేందర్, నిరంజన్ రెడ్డి, ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్, సిఎస్ సోమేశ్కుమార్ పాల్గొన్నారు.

బ్యాంక్ దోపిడీకి విఫలయత్నం

రంగారెడ్డి,మే22(ఆర్ఎన్ఎ): చేవెళ్లలోని ఓ బ్యాంకు దోపిడికి దొంగలు యత్నించారు. గురువారం తెల్లవారుజాము సమయంలో దొంగలు బ్యాంకు వద్దకు చేరుకున్నారు. కంపౌండ్ వాల్‌లోకి ప్రవేశించిన దొంగలు.. బ్యాంకు వెనుకభాగంలోని కిటికీని ధ్వంసం చేశారు. దాని గుండా లోపలికి చొరబడిన దొంగలు.. లాకర్లను తెరిచేందుకు ప్రయత్నించారు. కానీ ఫలితం లేకుండా పోయింది. దీంతో దొంగలు అటునుంచి ఖాళీ చేతులతో వెళ్లిపోయారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో బ్యాంకు సిబ్బంది అక్కడికి చేరుకోగానే కిటికీ ధ్వంసమైన ఆనవాళ్లు కనిపించాయి. దీంతో అప్రమత్తమైన సిబ్బంది.. తమ ఉన్నతాధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. బ్యాంకు వద్దకు చేరుకున్న పోలీసులు ఆ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. స్థానికులే ఈ ఘటనకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

తెరుచుకున్న సింగరేణి గనులు

భూపాల్‌పల్లి,మే22(ఆర్ఎన్ఎ):లాక్ డౌన్‌తో మూతపడిన సింగరేణి భూగర్భ గనులు తెరుచుకున్నాయి. కార్మికులు విధులకు హాజరవుతున్నారు. గురువారం ఉదయం నుంచి సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని భూగర్భ గనుల్లో విధులకు కార్మికులు హాజరవుతున్నారు. సుమారు 23 భూగర్భగనులకు సంబంధించిన ఉత్పత్తి ప్రారంభమవుతుంది. కరోనా వైరస్ నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుంచి భూగర్భ గనులు మూతపడ్డాయి. 50 రోజుల వ్యవధిలో 40 లక్షల టన్నుల మేర బొగ్గు ఉత్పత్తిని కోల్పోయింది. గురువారం తిరిగి బొగ్గు ఉత్పత్తి ప్రారంభమవుతోంది. సడలింపుల నేపథ్యంలో అన్ని పరిశ్రమలు తెరుచుకోడంతో బొగ్గుకు డిమాండ్ పెరిగింది.

రాష్ట్రంలో కరోనా టెస్టుల్లో గోల్‌మాల్

తక్కువ టెస్టులు చేస్తూ మోసం

రోజుకు 5 వేలు టెస్టులు చేయాల్సి ఉంది

జగిత్యాలలో మీడియాతో పిసిసి చీఫ్ ఉత్తమ్

జగిత్యాల,మే22(ఆర్ఎన్ఎ): తెలంగాణలో తక్కువ టెస్ట్‌లు చేస్తున్నందువల్లే తక్కువ కరోనా కేసులు నమోదవుతున్నాయని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలకు భిన్నంగా టెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడుతూ... 'పక్క రాష్ట్రాల్లో 2 లక్షల టెస్టులు చేస్తే తెలంగాణలో కేవలం 22 వేల టెస్టులు మాత్రమే చేశారు. ప్రభుత్వం పారదర్శకంగా పని చేయడం లేదు. ఐసీఎంఆర్ ప్రైవేట్ ఆసుపత్రులలో టెస్టులు చేయాలని చెబితే హైకోర్టు చెప్పేవరకు రాష్ట్రం పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి తప్పుడు ధోరణి వల్లనే తక్కువ కేసులు నమోదవుతున్నాయి. రాష్ట్రంలో రోజుకు 5 వేలు టెస్టులు చేయాల్సి ఉంటే కేవలం 200 మాత్రమే చేస్తున్నారని, దీంతో ప్రజల్లో ఆందోళన నెలకొందన్నారు. తెలంగాణలో కూడా ప్రతి 10 లక్షల మందికి 650 టెస్టులు మాత్రమే చేశారని అన్నారు. మాజీ మంత్రి రత్నాకర్ రావు దశదిన కర్మకు హాజరయ్యేందుకు జగిత్యాల వచ్చిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 14 వరకు రాష్ట్రంలో కేవలం 20 వేల మందికే కరోనా టెస్టులు చేశారని చెప్పారు. రోజూ 250 మందికి మాత్రమే టెస్టులు చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, దిక్షనరిలో ఎన్ని తిట్లు ఉంటే అన్ని తిడుతున్నాడని అన్నారు. మొదట్లో పారాసిటమాల్ వేసుకుంటే కరోనా రాదని చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. సూర్యాపేట జిల్లాలో అధికారుల పర్యటన తర్వాత అస్సలు టెస్టులే చెయ్యలేదని అన్నారు . ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలనూ ఇక్కడ పట్టించుకోలేదని అన్నారు. కరోనా టెస్టుల విషయంలో హైకోర్టు మొట్టికాయలు వేసిందని చెప్పారు. కేసీఆర్ కు, అధికారులకు మధ్య సమన్వయం లేదని, వలస కూలీలను ఆదుకునే విషయంలో కేసీఆర్ విఫలం అయ్యారని ఉత్తమ్ విమర్శించారు. ప్రభుత్వం దగ్గర వలస కూలీల లెక్కలు లేవని,కూలీలు వెళ్ళిపోతే.. ప్రభుత్వానికి తిప్పలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో వలస కూలీలు ఎంత మంది ఉన్నారో కూడా ప్రభుత్వం చెప్పలేకపోతుంది. ఇక మీరు వాళ్లకు ఏం తిండి పెడతారని అన్నారు. కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ వలస కూలీలకు రవాణా ఖర్చులు చెల్లించినందుకు అభినందిస్తున్నాను. కేంద్రం నుండి వివిధ వర్గాల నుండి వచ్చిన విరాళాల వివరాలు చెప్పమంటే చెప్పట్లేదు. కరోనాకు ఎంత ఖర్చు చేశారో కూడా చెప్పట్లేదు. 6 ఏళ్లుగా అడ్డగోలు అప్పులు చేసి రాష్ట్రాన్ఇన దివాళా తీయించారని మండిపడ్డారు. రాష్ట్రం కరోనా వల్ల అప్పులపాలు కాలేదు. రాష్ట్ర ప్రజలను, బండ్లను కుదువపెట్టి 4 వేల కోట్లు అప్పు తెచ్చారు. మహ్మద్ బిన్ తుగ్లక్ కంటే కేసీఆర్ ఎక్కువ చెబుతున్నారు' అని ఉత్తమ్ కుమార్ ధ్వజమెత్తారు. ఇకపోతే కందులు కొని 3 నెలలు గడిచినా ఇంకా డబ్బులు ఇవ్వలేదు కానీ మళ్ళీ కంది పంట వేయమంటరా? అని ప్రశ్నించారు. రైతుబంధు పథకంలో మోసం జరిగిందని ఆరోపించారు. హుజూర్‌నగర్ లో ఎన్నికలు వున్నాయని రైతుబందు ఇచ్చారన్నారు. మొట్టమొదటిసారి క్రాప్ ఇన్సూరెన్స్ లేదని, రాష్ట్రంలో రైతులను దేవుడికి వదిలేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ రైతుల కోసం ఏందాకైనా పోరాడుతుందని చెప్పారు. పత్తి విత్తనాల కంపెనీలతో ప్రభుత్వానికి లోపాయికారి ఒప్పందం ఉందన్నారు. పత్తి 7 వేలకు కొంటేనే వేయమని చెప్పాలని, నూనె గింజలకు, పప్పు ధాన్యాలకు తగిన ధర ఇచ్చినప్పుడే పంటలు వేయమని చెప్పాలి అని ఉత్తమ్‌కుమార్ అన్నారు.

హైదరాబాద్ విజయవాడ రూట్లో ఇక రైళ్ల పరుగులు

జూన్1 నుంచి నడిచేలా ప్లాన్ చేస్తున్న దక్షిణమధ్య రైల్వే

హైదరాబాద్,మే22(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ ముగుస్తున్న వేళ రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్యరైల్వే రంగం సిద్ధం చేసింది. జూన్ 1 నుంచి విజయవాడ మీదుగా పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. హౌరా- సికింద్రాబాద్ మధ్య ప్రతిరోజూ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ నడవనుంది.

విజయవాడ, ఏలూరు మీదుగా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ వెళ్లనుంది. గుంటూరు- సికింద్రాబాద్ మధ్య రోజూ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అయితే విజయవాడ, రాయనపాడు, కొండపల్లిలో గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఆగుతుంది. హైదరాబాద్- విశాఖ మధ్య రోజూ గోదావరి ఎక్స్‌ప్రెస్ నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి మీదుగా గోదావరి ఎక్స్‌ప్రెస్ ప్రయాణిస్తుంది. జూన్1 నుంచి రోజూ ముంబై- భువనేశ్వర్ కోనార్క్ ఎక్స్‌ప్రెస్ నడవనున్నారు. అంతేకాకుండా విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, తుని మీదుగా రైలు వెళ్లనుంది. దీంతో పాటుగా ధనపూర్- కేఎస్ఆర్ బెంగళూరు మధ్య సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ వెళ్తుంది. గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ మీదుగా సంఘమిత్ర రైలు వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే విశాఖ- న్యూఢిల్లీ మధ్య ప్రతిరోజూ ఏపీ ఎక్స్‌ప్రెస్ నడవనుంది.

విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, అనకాపల్లి మీదుగా ఏపీ ఎక్స్‌ప్రెస్ నడుస్తుంది. హౌరా-యశ్వంతపూర్ జంక్షన్ మధ్య వారంలో 5 రోజులు దురంతో ఎక్స్‌ప్రెస్ నడిపిస్తారు. మంగళ, బుధ, శుక్ర, శని, ఆదివారాల్లో దురంతో ఎక్స్ ప్రెస్ నడవనుంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 9 రైళ్లు.. తెలంగాణ, ఏపీకి 8 రైళ్లు నడుస్తాయన్నారు. సికింద్రాబాద్ నుంచి హౌరా, ధనపూర్, గుంటూరు, నిజాముద్దీన్ రైళ్లు.. హైదరాబాద్ నుంచి ఢిల్లీ, ముంబై, విశాఖ రైళ్లు... తిరుపతి-నిజామాబాద్, నాందేడ్- అమృత్‌సర్ రైళ్లను నడుపుతామన్నారు. ఆన్‌లైన్ ద్వారానే టికెట్లను విక్రయిస్తామన్నారు. ప్రయాణికులకు మాస్క్ తప్పనిసరి అని తెలిపారు. ప్రయాణికులు తమతో ఆహారం తీసుకెళ్లాలని రాకేష్ సూచించారు.

గీసుకొండ బావిలోనే మరో మూడు మృతదేహాలు

శవాలను బయటకు తీసి పోస్ట్ మార్టమ్‌కు పంపిన పోలీసులు

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కమిషనర్ రవీందర్

ఘటనకు కారణాలపై పోలీసులు దర్యాప్తు

వరంగల్ రూరల్,మే22(ఆర్ఎన్ఎ): కనిపించకుండా పోయారనుకున్న మరో ముగ్గురి మృతదేహాలు లభించాయి. గురువారం తీసిన బావిలోనే వారి శవాలు కూడా బయటపడ్డాయి. దీంతో మిస్టరీ వీడింది. అయితే ఇవి హత్యలా లేక ఆత్మహత్యలా అన్న మిస్టరీ వీడాల్సి ఉంది. గీసుగొండ మండలం గొర్రెకుంట ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ బారదాన్ గోడౌన్ లో గల బావిలో పడి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు మృతి చెందిన సంగతి తెసిందే. ఈ బావిలో నుంచి గురువారం ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతదేహాలను పోలీసులు కనుగొన్నారు. శుక్రవారం ఉదయం ఒకటి తర్వాత ఒకటి మొత్తం మూడు మృతదేహాలు బావిలో తేలాయి. వీటిలో ఒకటి బావిలో నుంచి వెలికి తీసి పోస్ట్ మార్టం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. మరో రెండు మృతదేహాలను వెలికి తీయాల్సి ఉంది. ఇంకో మృతదేహం కూడా ఉండొచ్చనే అనుమానంతో పోలీసులు బావిలోని నీరు తోడుతున్నారు. గురువారం నాలుగు మృతదేహాలు లభ్యం కాగా.. తాజాగా మరో మూడు లభించాయి. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. కుటుంబం మొత్తం ఒకేసారి ఇలా బావిలో శవాల్లా కనిపించడం వెనక అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వారంతా ఆత్మహత్య చేసుకున్నారా..? లేక ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. సంఘటన స్థలాన్నివరంగల్ పోలీసు కమిషనర్ రవీందర్ సందర్శించి పరిసరాలను పరిశీలించారు. బావిలో వలస కూలీల మృతదేహాలు లభ్యం కావడం వరంగల్ జిల్లాలో సంచలనం సృష్టించింది. పొట్ట చేతపట్టుకుని వచ్చిన వారంతా చనిపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. బిహార్‌కు చెందిన మక్సూద్ (50) కుటుంబం 20 ఏళ్ల క్రితం వరంగల్‌కు వలస వచ్చింది. అక్కడా ఇక్కడా పని చేసుకుంటూ కొన్ని రోజుల క్రితం గీసుకొండలోని గోనే సంచులు తయారు చేసే పరిశ్రమలో పని చేస్తున్నారు. వీరంతా పరిశ్రమలోనే ఓ గదిలో నివాసం ఉంటున్నారు. తాజాగా మన్సూద్ అతని భార్య నిషా, ఇద్దరు కొడుకులు, కూతురు, మనవడు బావిలో శవాలై కనిపించారు. వీరంతా మసూద్, నిషా, బుషారాకతూన్, బేబీ, షకీల్, షాబాజ్ అలం, సోహైల్ అలంగా గుర్తించారు. అయితే వీరితో పాటు పక్కనే నివాసం ఉండే బీహార్‌కు చెందిన వలస కూలీలు ఇద్దరు కనిపించడం లేదు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. మృతదేహాలపై ఎటువంటి గాయాలు లేకపోవడంతో పోస్టుమార్టం రిపోర్టు రావాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు.

వరంగల్ జిల్లా గీసుకొండలో బావిలో నుంచి శవాలను బయటకు తీసిన ప్రాంతాన్ని పరిశీలించిన వరంగల్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రవీందర్

ఆంఫన్ తుఫాను కారణంగా రుతుపవనాల రాక ఆలస్యం

కేరళను ఆలస్యంగా తాకుతాయన్న వాతావరణ శాఖ

-అధ్యయనంలో తేలిందన్న డైరెక్టర్ జనరల్

న్యూఢిల్లీ,మే21(ఆర్ఎన్ఎ): ఆంఫన్ తుఫాను కారణంగా దేశంలో రుతుపవనాల రాక ఆలస్యం కానుందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీనికి సంబంధించి జాతీయ వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర గురువారం మీడియాతో మాట్లాడారు. 'సాధారణంగా రుతుపవనాలు జూన్ 1న కేరళను చేరుకుంటాయి.

అయితే ఆంఫన్ తుఫాను కారణంగా వాతావరణం దెబ్బతిన్నదన్నారు. దీని కారణంగా రుతుపవనాలు ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నట్లు అధ్యయనంలో తేలిందని తెలిపారు. రుతుపవనాల రాక కనీసం 4 రోజులు ఆలస్యం కావచ్చని, జూన్ 1న కేరళ చేరుకోవాల్సిన రుతుపవనాలు జూన్ 5న చేరుకోవచ్చని చెప్పారు. ఇదిలా ఉంటే ఆంఫన్ తుఫాన బుధవారం బెంగాల్, ఒడిశాలలో తీరాన్ని చేరింది. భీరకమైన గాలులు, భారీ వర్షంతో జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తోంది. ఇప్పటికే ఈ తుఫాను వల్ల 72 మందికి పైగా మరణించినట్లు బెంగాల్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఒడిశా, బెంగాల్‌లోని తుఫాను పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు పలు సంస్థలతో కాబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా సమీక్ష నిర్వహించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అంపన్ పెను తుపాను బెంగాల్‌లో బీభత్సం సృష్టించింది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, బంగ్లాదేశ్‌లను తీవ్ర స్థాయిలో కుదిపేసింది. ఈ తుపాను దాటికి బెంగాల్‌లో భారీ ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. తుపాను తీరం దాటిన సమయంలో వీచిన భీకర గాలులు, భారీ వర్షాలకు 84మంది మృతిచెందగా.. అనేక మంది గాయపడ్డారు. ఒక్క బెంగాల్ రాష్ట్రంలోనే 72మంది మృతిచెందినట్టు సీఎం మమతాబెనర్జీ వెల్లడించారు. వీరిలో 15 మంది కోల్‌కతాకు చెందినవారే నన్నారు.

దాదాపు దశాబ్ద కాలం తర్వాత బెంగాల్‌లో భారీ నష్టం మిగిల్చిన తీవ్ర తుపాను ఇదే కావడం గమనార్హం. అంపన్ తీవ్రతకు తీర ప్రాంత గ్రామాలతో పాటు కోల్‌కతా వంటి నగరాల్లోనూ పెను విధ్వంసం సృష్టించింది. బెంగాల్‌లో వేల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. భారీ సంఖ్యలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మరోవైపు, ఒడిశాలో పంటలు దెబ్బతిన్నాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈ తుపాను తీవ్రతతో మృతిచెందిన వారికి సీఎం మమతా బెనర్జీ పరిహారం ప్రకటించారు. ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.2లక్షలు నుంచి రూ.2.5లక్షల వరకు పరిహారం ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీని సుందర్‌బన్స్ ప్రాంతంలో పర్యటించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో పునరుద్ధరణ కోసం ఆర్థికసాయం చేయాలన్నారు. కేంద్రమంత్రి అమిత్ షా తనతో మధ్యాహ్నం మాట్లాడారని చెప్పారు.

పెను తుపాను దాటికి బంగ్లాదేశ్‌లో 10మంది ప్రాణాలు కోల్పోయారు. తీర ప్రాంతంలోని గ్రామాల్లో విధ్వంసం సృష్టించింది. అనేక చోట్ల ఇళ్లు దెబ్బతిన్నాయని అధికారులు వెల్లడించారు. అలాగే, ఒడిశాలో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.

రైతుల మేలుకోరే నూతన వ్యవసాయ విధానం

అన్నదాతలకు లాభాలు రావాలన్నదే లక్ష్యం

వ్యవసాయ మార్కెట్ కమటీ ప్రమాణా స్వీకారోత్సవంలో మంత్రులు

సంగారెడ్డి,మే22(నేటినిజం ప్రతినిధి): రైతుల మేలు కోసే నూతన వ్యవసాయ విధానానికి సిఎం కెసిఆర్ నడుం బిగించారని మంత్రి హరీష్ రావు అన్నారు. వ్యాసరంగంలో తీసుకున్న నిర్ణయాల మేరకు రైతులు కూడా సహకరించి లాభాలు ఆర్జించాలని అన్నారు. పదవి రావడం గొప్ప కాదు.. పదవి నిర్వహించడం గొప్ప అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి, ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారానికి ఆర్థిక మంత్రి హరీశ్ రావు, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి హాజరై పఠాన్ చెరు మార్కెట్ యార్డులో నూతన షాపింగ్ క్లాంపెక్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు మేలు జరిగేందుకు కొత్త వ్యవసాయ విధానం సీఎం కేసీఆర్ తీసుకొచ్చినట్లు తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకే విప్లవాత్మక మార్పులు తెస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రం వచ్చిన తర్వాత సంగారెడ్డి జిల్లాలో కొత్తగా రెండు వ్యవసాయ మార్కెట్లు ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ మహా నగర అవసరాలు తీర్చేలా పటాన్ చెరు మార్కెట్ ను అభివృద్ధి చెయ్యాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చట్టంలోని నిబంధనలు సైతం మార్చుతామని తెలిపారు. హైదరాబాద్ మహా నగరానికి నలుదిక్కులా సమీకృత మార్కెట్లు అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

డబుల్ ఇల్లు ఇచ్చివుంటే ప్రాణాలు దక్కేవి

గోడకూలిన ఘటనపై గ్రామస్థుల ఆందోళన

నిజామాబాద్,మే22(ఆర్ఎన్ఎ): జిల్లాలోని వర్ని మండలం తగిలేపల్లిలో గోడ కూలి ముగ్గురు మృతి చెందిన ఘటనపై గ్రామస్తులు ఆందోళనకు దిగారు. శ్రీనివాస్, లక్ష్మి దంపతులతో పాటు ఏడాది వయసున్న కొడుకు సాయికుమార్ మృతికి గ్రామ పెద్దలే కారణమని నిరసన వ్యక్తం చేస్తున్నారు.

మృతురాలు లక్ష్మి పేరిట డబుల్ బెడ్ రూమ్ మంజూరు కాగా, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు మళ్లీ వెనక్కి తీసుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇచ్చి ఉంటే ప్రాణాలు దక్కేవని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెల్ల క్రితమే గ్రామంలో డబుల్ బెడ్ రూమ్‌లు పంపిణీ జరిగింది. ఈ ఘటనతో సర్పంచ్‌పై గ్రామస్తులు ఆరోపణలు గుప్పిస్తున్నారు.

ముంబైలో అరుదైన ఘనత

కరోనా విజృంభణలోనూ గర్భిణులకు సేవలు

కరోనా బారిన పడి 115మందికి జన్మనిచ్చిన మహిళలు

ముంబయి,మే22(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ ధాటికి ముంబయి నగరం అతలాకుతలమైనప్పటికీ ఓ అరుదైన ఘనతను అది సాధించింది. కరోనా సోకిన పలువురు మహిళలు పండండి బిడ్డలకు జన్మనించారు. దేశంలోని మెట్రో నగరాల్లో ఒకటైన ముంబయిలో కరోనా పాజిటివ్ కేసులు అత్యధికంగా నమోదు అయ్యాయి. ఒక్క ముంబయిలోనే 24 వేల పాజిటివ్ కేసులు నమోదు కాగా, 840 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే వందలాది మంది గర్భిణులు కూడా కరోనా వైరస్ బారిన పడ్డారు. వారిని కూడా ఐసోలేషన్ వార్డుల్లో ఉంచి చికిత్స అందించారు. అలాంటి గర్భిణుల్లో చాలా మంది సుఖ ప్రసవం చేశారు. కొందరికి సీజేరియన్ కూడా జరిగింది. పుట్టబోయే పిల్లలకు కరోనా లేదని తేలడంతో వారి తల్లిదండ్రులు సంతోషంలో మునిగిపోయారు. ముంబయిలో మాత్రం 100కు పైగా గర్భిణులకు కరోనా సోకింది. వీరంతా లోకమాన్య తిలక్ మున్సిపల్ జనరల్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. కరోనా సోకిన గర్భిణులు.. గత నెల రోజుల నుంచి 115 మంది పిల్లలకు జన్మనిచ్చారు. వీరిలో ముగ్గురికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయినప్పటికీ.. ఆ తర్వాత పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ వచ్చింది. కరోనా సోకిన ఇద్దరు గర్భిణులు మృతి చెందారు. కరోనా గర్భిణులకు పుట్టిన పిల్లల్లో 56 మంది మగ పిల్లలు, 59 మంది ఆడబిడ్డలు ఉన్నారు. ఈ గర్భిణులకు 65 మంది డాక్టర్లు, సుమారు 24 మంది నర్సులు దగ్గరుండి వైద్య సేవలు అందించారు. లోకమాన్య తిలక్ మున్సిపల్ జనరల్ ఆస్పత్రిలోని 40 బెడ్ల వార్డులో వీరికి చికిత్స అందించారు. గర్భిణీమహిళల కోసం అదనంగా 34 బెడ్లను అందుబాటులో ఉంచారు. అన్ని జాగ్రత్తలు తీసుకుని గర్భిణులకు డెలివరీలు చేశారు వైద్యులు. అయితే గర్భిణుల్లో అధిక మందికి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయినప్పటికీ వారిలో ఆ లక్షణాలు కనిపించలేదు. కొందరూ జ్వరం, శ్వాస సంబంధ సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చారని వైద్యులు తెలిపారు. డెలివరీ జరిగిన తర్వాతే వారిని వారి నివాసాలకు పంపించామని చెప్పారు. గర్భిణులకు డెలివరీ జరిగిన తర్వాత వారిని ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో ఉంచామన్నారు వైద్యులు. వారం రోజుల తర్వాత మళ్లీ క్వారంటైన్‌కు తరలించినట్లు చెప్పారు. అయితే పిల్లలకు పాలిచ్చే సమయంలో తల్లులు ఫేస్‌మాస్కు ధరించారు.

వాహనదారులపై ట్రాఫిక్ పోలీసుల కొరడా

కనిపిస్తే రూల్స్‌తో జరిమానాలు

హైదరాబాద్,మే22(ఆర్ఎన్ఎ): లాక్ డౌన్ ముగుస్తున్న వేళ సడలింపులతో నగరంలో వేలాది వాహనాలు రోడ్డెక్కాయి. దీంతో తిరిగి నగరంలో మలల్ఈ ట్రాఫిక్ పెరిగింది. కరోనా నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజలు మళ్లీ తమ రొటీన్ లైఫ్‌లోకి అడుగుపెడుతున్నారు. ఈ సమయంలో పోలీసులు కొత్త రూల్స్‌తో ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం లాక్ డౌన్ సడలింపులు ఇచ్చిన దగ్గర నుంచి రూల్స్ అతిక్రమించేవారి కోసం సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొత్త నిబంధనలను అమలు చేస్తున్నారు. ఇక బైక్ నడిపేవారు, వెనుక కూర్చున్న వారు ఖచ్చితంగా హెల్మెట్లు పెట్టుకోవాల్సిందే. లేదంటే భారీ ఫైన్ పడుతుంది. ఇక పదేపదే రూల్స్‌ను ఉల్లంఘిస్తే మోటార్ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తారు. అటు ఫిబ్రవరి నుంచి బైక్ సైడ్ మిర్రర్స్ లేకున్నా ట్రాఫిక్ పోలీసులు జరిమానా వేస్తున్న సంగతి తెలిసిందే. తొలిసారి దొరికితే రూ. 100, రెండోసారి దొరికితే రూ. 300 ఫైన్ పడుతుంది. కాగా, ప్రజలు ఫుల్ హెల్మెట్లను మాత్రమే వాడాలని హాఫ్ హెల్మెట్ ఉపయోగించ కూడదన్నారు. ఈ కొత్త రూల్స్ అన్నీ కూడా ప్రజల శ్రేయస్సు కోసమేనని సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు. అటు సీఎం కేసీఆర్ భాగ్యనగరంలో లాక్ డౌన్ సడలింపులు ఇవ్వడంతో రోడ్లు రద్దీగా మారాయి.

ఇంతటి విలయాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదు

తుపాన్ ధాటికి 72మంది మృతి చెందారన్న మమత

కోల్‌కతా,మే22(ఆర్ఎన్ఎ): తన జీవితంలో ఇప్పటివరకు ఇలాంటి ప్రకృతి ప్రకోపాన్ని చూడలేదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ అన్నారు. అంఫాన్ తుఫాన్ వల్ల రాష్ట్రంలో ఇప్పటివరకు 72 మంది మరణించారని ఆమె వెల్లడించారు. తుఫాన్ సృష్టించిన విలయాన్ని పరిశీలించడానికి రాష్ట్రంలో పర్యటించాలని ప్రధాని మోదీని తానే స్వయంగా కోరుతానని చెప్పారు. చాలా మంది క్షతగాత్రులయ్యారని, తుఫాను వల్ల మరణించినవారి కుటుంబాలకు రూ.2.5 లక్షలు నష్టపరిహారం చెల్లిస్తామని ఆమె ప్రకటించారు.

అంఫాన్ తుఫాన్ పశ్చిబెంగాల్‌లో బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురుగాలులు, వర్షాల వల్ల వేలాది ఇండ్లు ధ్వంసమయ్యాయి. బెంగాల్ తీరం వెంబడి గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతోపాటు కుండపోత వర్షం కురియడంతో కోల్‌కతాలోని అంతర్జాతీయ విమానాశ్రయం జలదిగ్భందమయ్యింది. రన్‌వే, హాంగర్లు పూర్తిగా నీటమునడగంతోపాటు, బలమైన ఈదురు గాలుతో విమానాశ్రయంలోని కొన్ని నిర్మాణాలు విరిగిపడ్డాయి. దీంతో

కుమ్రం భీమ్ జిల్లాలో పులి సంచారం

పశువుల కాపరిపై దాడికి యత్నం

ఆసిఫాబాద్,మే22(ఆర్ఎన్ఎ): కుమ్రంభీం జిల్లాలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. గత 20 రోజులుగా రెబ్బన, తిర్యాణి, ఆసిఫాబాద్ మండలాల్లో సంచరిస్తూ.. స్థానికులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. మూడు రోజుల నుంచి తిర్యాణి మండలం, ఖైరీగూడ ఓపెన్ కాస్ట్ బొగ్గుగని పరిసరాల్లో తిరుగుతూ హడలెత్తిస్తోంది. ఓపెన్ కాస్ట్ మట్టి తవ్వకాల్లో పనిచేస్తున్న కార్మికులు డంపింగ్ యార్డ్ దారిలో వాహనంలో వెళుతుండగా పెద్దపులి కనిపించింది. దీంతో వాహనాన్ని నిలిపివేశారు. మట్టికుప్పమీదుగా అదేదారిలో వెళుతున్న పశువులమందపై దాడికి పులి యత్నించింది. పశువులు బిగ్గరగా అరుస్తూ తప్పించుకున్నాయి. ఈ దృశ్యాలను వాహన డ్రైవర్ తన ఫోన్‌లో చిత్రీకరించాడు. పులి ప్రస్తుతం మట్టికుప్పల్లోనే ఉంది. ఇదే పులి 10 రోజుల క్రితం వాగులోంచి దర్జాగా వెళుతుండగా స్థానికులు చాలా వీడియోలు తీశారు. ఈ పులి గత నెల నుంచి ఆసిఫాబాద్ శివారు గ్రామాల్లో తిరుగుతూ వస్తోంది. ఆసిఫాబాద్ మండలం, చిర్రకుంట, కుంపల్లి అటవీప్రాంతాల్లో మేతకు వెళ్లిన పశువులపై పులి దాడి చేసింది. ఆసిఫాబాద్ పట్టణంలోని సందీప్‌నగర్‌లోకి వచ్చినట్టుగా ప్రచారం జరిగింది. అక్కడి ప్రజలు రాత్రాంతా జాగారం చేశారు. పెద్ద సంఖ్యలో బయటకు వచ్చి పులి కోసం వెతికారు. అయినా అది కనిపించలేదు.

కుమారుడిని రక్షించే క్రమంలో రెజ్లర్ మృతి

కాలిఫోర్నియా సముద్ర తీరంలో ఘటన

కాలిఫోర్నియా,మే22(ఆర్ఎన్ఎ): కుమారుడిని రక్షించే క్రమంలో ఓ డబ్ల్యూడబ్లూఈ మాజీ రెజ్లర్ మృతిచెందిన సంఘటన అమెరికాలోని కాలిఫోర్నియాలో చోటుచేసుకుంది. స్థానిక వినీస్ మెరీనా బీచ్‌లో ఆదివారం ఈతకు వెళ్లిన మాజీ రెజ్లర్ షాన్ గాస్పర్డ్ తన కుమారుడిని కాపాడే క్రమంలో సముద్రంలో కొట్టుకుపోయాడు. బుధవారం అతని మృతదేహం సముద్ర తీరానికి కొట్టుకువచ్చిందని స్థానిక అధికారులు వెల్లడించారు. కరోనా వైరస్ నేపథ్యంలో అమెరికాలో గతవారమే సందర్శకుల కోసం బీచ్‌లను తిరిగి తెరిచారు. ఈ క్రమంలో ఆదివారం గాస్పర్డ్ తన పదేళ్ల కుమారుడు ఆర్యేహ్‌తో కలిసి ఈతకు వెళ్లాడు. వాళ్లిద్దరూ ఈత కొడుతుండగా ఓ భారీ అల వచ్చింది. తండ్రీ కొడుకులు దాంట్లో చిక్కుకోవడంతో తాము రక్షించేందుకు యత్నించామని అక్కడి లైఫ్‌గార్డులు పేర్కొన్నారు. ఈ క్రమంలో గాస్పర్డ్ ముందు తన కొడుకుని రక్షించాలని కోరడంతో ఆ బాలుడిని తీసుకొని ఒడ్డుకు చేర్చామని లైఫ్‌గార్డులు తెలిపారు. వెంటనే గాస్పర్డ్ కోసం వెతికినా అతని జాడ కనిపించలేదని చెప్పారు. బుధవారం ఉదయం వినీస్ తీరంలో ఒక మృతదేహం కొట్టుకొచ్చిందని, అది ఆదివారం సముద్రంలో కొట్టుకుపోయిన గాస్పర్డ్ మృతదేహమని పోలీసులు వెల్లడించారు. 2010లో డబ్ల్యూడబ్ల్యూఈ నుంచి రిటైరైన గాస్పర్డ్ తర్వాత టీవీ, సినిమాల్లో నటిస్తున్నాడు. మాజీ రెజ్లర్ మృతి పట్ల డబ్ల్యూడబ్ల్యూఈ సంస్థతో పాటు పలువురు రెజర్లు సంతాపం తెలిపారు.

.సూర్యాపేట నియోజకవర్గంలో రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి

మూసధోరణి వ్యవసాయానికి స్వస్తి పలకాలి

లాభదాయక పంటలనే పండించాలి
రోడ్డు నిర్మాణాల శంకుస్థాపనలో మంత్రి జగదీశ్వర్ రెడ్డి

సూర్యాపేట,మే22(ఆర్ఎన్ఎ): రైతులు మూసధోరణిలో చేస్తున్న వ్యవసాయ పద్ధతులకు స్వస్తిపలకాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. లాభదాయక పంటలపై దృష్టిసారించాలని ఉద్బోధించారు. రైతును రాజును చెయ్యడమే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పమని చెప్పారు. ఆ సంకల్ప బలం చేకూరే విధంగా రైతాంగం వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.సూర్యాపేట నియోజక వర్గం పరిధిలోని పలు గ్రామాల్లో 90కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన రహదారుల నిర్మాణపు పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. లక్ష్మీనాయక్ తండా,పాచ్యానాయక్‌తండా, కోట పహాడ్, జి.మల్కాపురంతో పాటు కందగట్ల దూరజ్‌పల్లి, బాలెం, ముక్కుదేవులపల్లి తదితర గ్రామాల్లో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ లాభదాయక పంటలపై ముఖ్యమంత్రి కేసీఆర్ నూతనంగా రూపొందించిన గైట్‌లైన్స్‌ను విధిగా పాటించాలని రైతాంగానికి విజ్ఞప్తిచేశారు. ఏయే ప్రాంతల్లో ఎలాంటి పంటలు వేస్తే రైతులకు లాభదాయకమనేది ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యయనం చేశారని మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఆ సంకల్పబలం చేకూరే విదంగా రైతాంగం వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. కరోనా మహమ్మారి ప్రబలడంతో అభివృద్ధి పనులకు కాసింత ఆటంకం ఏర్పడిందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో కనిపించని శత్రువుపై జరిగిన పోరాటంలో మనోధైర్యాన్ని సాధించాలన్నారు. అలాగే కరోనాను అశ్రద్ధ చేయడం కూడా తగదన్నారు. స్వీయ నియంత్రణ పాటిస్తూ భౌతిక దూరమే కరోనాకు మందు అని మంత్రి పేర్కొన్నారు. వ్యాక్సిన్ వచ్చే వరకూ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి జగదీశ్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగులింగయ్య యాదవ్, జిల్లా పరిషత్ ఛైర్మన్ గుజ్జ దీపికా యుగంధర్‌రావు,వైఎస్ ఛైర్మన్ గోపగాని నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 5న ప్రారంభం కానున్న 'సిడ్బ్' స్వావలంబన్

హైదరాబాద్, మే 22: సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల (యంఎస్ఎంఇ) ప్రచారం, రుణ సహాయం మరియు అభివృద్ధి కోసం పనిచేసే ప్రధాన ఆర్థిక సంస్థగా ఉన్న భారత చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (సిడ్బ్) రానున్న 5 వ జూన్, 2020న తమ స్వావలంబన్ ఎక్స్ ప్రెస్‌ను లక్నో నుంచి ప్రారంభించడానికి సిద్ధమైంది. లక్నో నుంచి బయలుదేరే ఈ రైలు అక్కడి నుంచి జమ్మూ, ఢిల్లీ, జైపూర్, అహ్మదాబాద్, ముంబయ్, బెంగళూరు, హైదరాబాద్, భువనేశ్వర్, కోల్‌కతా మీదుగా ప్రయాణించి చివరగా వారణాసి చేరుకోనుంది. తద్వారా, 15 రోజుల్లో 7,000 కిలోమీటర్లు ప్రయాణించి 11 పారిశ్రామిక నగరాలను సందర్శించనుంది. ఈ సందర్భంగా, కొత్త, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు మరియు స్టార్-అప్‌ల వారు 20కి పైగా వర్క్ షాప్‌లు, పరస్పర సంభాషణల అనుభవం అందుకోనున్నారు. ఆవిధంగా, వారి వ్యవస్థాపక ప్రయాణంలో వారికి అవసరమైన ప్రోత్సాహక సహాయం అందుకోనున్నారు. ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ మొహమ్మద్ ముస్తఫా, ఐఎఎస్ మాట్లాడుతూ, "యువతలో వ్యవస్థాపక సంస్కృతిని ప్రోత్సహించే లక్ష్యంతో మేము తీసుకొచ్చిన మా అంబ్రెల్లా మిషన్ స్వావలంబన్‌లో భాగంగా ఈ స్వావలంబన్ ఎక్స్ ప్రెస్ ప్రారంభిస్తున్నాము. స్ఫూర్తిదాయక భారతదేశం ద్వారా శక్తిమంతం చేయబడిన ఒక స్ఫూర్తిదాయక ప్రయాణం ఇది. వ్యవస్థాపక ఆలోచనతో ఈ రైలులోకి ప్రవేశించే యువత ఇందులో వరుస ప్రయోగాత్మక అభ్యసనాల అనుభవంతో చివరకు తమదైన వ్యాపార ఆలోచనతో బయటకు వస్తారు. ప్రతి పారిశ్రామిక నగరం అందించే అనుభవంతో వారిలో వ్యవస్థాపక ఆలోచన బలపడుతుంది. వారు ఒక స్వావలంబిగా మారడానికి ఇదొక విశిష్ట అనుభవంగా ఉంటుంది. నాలుగు గోడల మధ్య పాఠశాల లాంటి అనుభవం ఇది" అన్నారు. ఆనాటి నుంచి ఈ సంస్థ తనదైన సమగ్ర, వినూత్న సమ్మిళిత అందుబాటు ద్వారా సమాజంలోని విభిన్న వర్గాలకు చెందిన పౌరుల జీవితాలను ప్రభావితం చేస్తోంది. సంప్రదాయ, స్వదేశీ చిన్న స్థాయి వ్యవస్థాపకులు, ప్రాథమిక స్థాయిలోని వ్యవస్థాపకవేత్తలు మొదలుకొని అత్యున్నత పరిజ్ఞానం కలిగిన వ్యవస్థాపకవేత్తల వరకు సూక్ష్మ మరియు చిన్న తరహా పరిశ్రమల (ఓఇఎల) వారి జీవితాలను రాఎఆఎ తన విభిన్న క్రెడిట్, అభివృద్ధి సంబంధిత కార్యక్రమాల ద్వారా ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో స్పృశిస్తూనే ఉంది.ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ మొహమ్మద్ ముస్తఫా, ఐఎఎస్ మాట్లాడుతూ, "యువతలో వ్యవస్థాపక సంస్కృతిని ప్రోత్సహించే లక్ష్యంతో మేము తీసుకొచ్చిన మా అంబ్రెల్లా మిషన్ స్వావలంబన్‌లో భాగంగా ఈ స్వావలంబన్ ఎక్స్ ప్రెస్ ప్రారంభిస్తున్నాము. స్ఫూర్తిదాయక భారతదేశం ద్వారా శక్తిమంతం చేయబడిన ఒక స్ఫూర్తిదాయక ప్రయాణం ఇది.ఈ రైలులో ప్రయాణించే రోల్ మోడల్స్ లాంటి నిపుణులు, గురువులతో వారి సంభాషణ, మేధో మథనాలు మరియు బృంద చర్చలు లాంటివి ఇందుకు ఉపయోగపడనున్నాయి. దాదాపు 500 మంది ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు.

నాయిబ్రాహ్మణులను ఆదుకుంటాం: వినోద్

హైదరాబాద్,మే22(ఆర్ఎన్ఎ): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్ననాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ హామీనిచ్చారు. బంజారా హిల్స్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు వినోద్ కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

లాక్ డౌన్ నేపథ్యంలో నాయీ బ్రాహ్మణులు అన్ని రకాలుగా నష్టపోయిన విషయాన్ని సంఘం నాయకులు వినోద్ కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యల పట్ల వినోద్ కుమార్ సానుకూలంగా స్పందించారు. దశల వారీగా పరిష్కరించనున్నట్లు హామీనిచ్చారు. లాక్ డౌన్ తో ఆర్థికంగా నష్టపోయిన నాయీ బ్రాహ్మణులను ఆదుకోవాలని, విద్యుత్ రాయితీలు కల్పించాలని, పని ముట్లను అందించాలని సంఘ నాయకులు వినతి పత్రంలో కోరారు.

కోరానపై పరస్పర విరుద్ధంగా లెక్కలు

ట్విట్టర్‌లో వమర్శలు గుప్పించిన చిందంబరం

న్యూఢిల్లీ,మే22(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ సంస్థలు వెల్లడించిన కరోనా వైరస్ గణాంకాల మధ్య తేడా ఉండటంపై కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం విస్మయం వ్యక్తం చేశారు. కేంద్ర ఆరోగ్య శాఖ, ఐసీఎంఆర్ వెల్లడించిన కొవిడ్-19 కేసుల సంఖ్యలో తేడా ఉందంటూ అయన ట్విటర్‌లో విమర్శించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ వివరాల ప్రకారం... 66,330 యాక్టివ్ కేసులు, 3,583 మరణాలతో సహా ప్రస్తుతం దేశంలో కొవిడ్-19 కేసుల సంఖ్య 1,18,447. ఐతే దాష్‌బోర్డులో మాత్రం మొత్తం కేసుల సంఖ్య 1,16,723గా ఉంది అంటూ చిదంబరం ఈ ఉదయం ట్వీట్ చేశారు. కేంద్ర ఆరోగ్యశాఖ శుక్రవారం విడుదల చేసిన కొవిడ్ కేసుల గణాంకాల ప్రకారం.. గడిచిన 24 గంటల్లో 6,088 కొత్త కేసులు నమోదైనట్లు పేర్కొంది. దీనితో దేశవ్యాప్తంగా కరోనా బాధితుల సంఖ్య 1,18,447కు చేరినట్లు ఆరోగ్యశాఖ ప్రకటించింది. పొంతనలేని లెక్కలపై చిదంబరం మండిపడ్డారు.

అక్రమరవాణాకు సిద్ధంగా ఉన్న 130 క్వింటాళ్ళ పిడిఎస్ బియ్యం పట్టివేత

ముగ్గురిపై కేసు నమోదు స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ 2.6 లక్షల రూపాయలు

కరీంనగర్, మే 22(నేటినిజం ప్రతినిధి):ప్రభుత్వం పేదప్రజలకు ఒకరూపాయికి కిలో చొప్పున అందజేసే (పిడిఎన్) బియ్యాన్ని అక్రమంగా రవాణాచేసేందుకు సిద్ధమై వాహనంలో నిల్వఉంచిన 130 క్వింటాళ్ళ బియ్యాన్ని కరీంనగర్ కమీషనరేట్ ప్రత్యేక విభాగం పోలీసులు శుక్రవారం తెల్లవారుజాము 05గంటల ప్రాంతంలో స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ 2.60లక్షల రూపాయలు. వివరాలు ఇలా ఉన్నాయి.

రామడుగు మండలం బుడగజంగాల కాలనీ ప్రాంతంలో పిడిఎస్ బియ్యం రవాణా చేసేందుకు లోడ్‌సిద్ధమైందని సమాచారం అందుకున్న కమీషనరేట్ ప్రత్యేక విభాగానానికి చెందిన రిజర్వ్‌ఇన్‌స్పెక్టర్లు జానీమియా(యంటివో) మలేశం(అడ్మిన్) బృందం సదరు ప్రాంతానికి చేరుకుని రవాణాకు సిద్ధంగా ఉంచి ఐచర్‌వ్యాన్‌లో నిల్వఉంచిన 130క్వింటాళ్ళ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కరీంనగర్ అడిషనల్ డిసిపి(పరిపాలన)జి చంద్రమోహన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వక్కానమాచారంతో కమీషనరేట్ ప్రత్యేకబృందం పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున అక్రమంగా రవాణాచేసేందుకు సిద్ధమైన బియ్యం నిల్వలనలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రామడుగు పోలీసులకు అప్పగించారు. ప్రత్యేక విభాగం పోలీసులు దాడిజరిపిన సందర్భంలో కరీంనగర్ మండలం రేకుర్తి గ్రామానికి చెందిన డ్రైవర్ పేగు మహేష్(27) వరారీకోసం ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బియ్యం ఎక్కడికి తరలిస్తున్నారు. ఇందులో పాత్రదారులపై ఆరాతీశారు. రామడుగుకు చెందిన పర్వతం గంగాధర్(32)వ్యాపారి, రేకుర్తికి చెందిన వ్యాన్ యజమాని సిహెచ్ పుల్లయ్య(45)లపై కేసును నమోదు చేశారు. పిడిఎస్ బియ్యం రవాణాకు సిద్ధమైన వాహనానికి ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు అత్యవసరసేవలందించే విభాగానికి సంబంధించిన స్టిక్కర్‌ను అతికించడంతోపాటు పిడిఎస్ బియ్యం బయటకు కనిపించకుండా ఉండ్డేందుకు వడ్ల బస్తాలను అడ్డుగా పెట్టి బియ్యం నిల్వచేసి ఉంచారు. ఇక్కడి నుండి నిజామాబాద్ మీదుగా మహారాష్ట్రకు ఈ పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్నామని నిందితులు విచారణలో అంగీకరించారు. పోలీసులు ప్రజలతో కొనసాగిస్తున్న సత్సంబంధాలతో ఎక్కడ ఎలాంటి అక్రమకార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందుతోందన్నారు. తరచూ వివిధరకాల నేరాలు, అక్రమకార్యకలాపాలకు పాల్పడే వారు వెంటనే పద్ధతులు మార్చుకోవాలని ఇలాంటి సంఘటనలు,నేరాలు పునరావృతం అయితే సదరువ్యక్తులపై పిడియాక్ట్‌ను అమలుచేస్తామని హెచ్చరించారు. పిడిఎస్‌బియ్యం నిల్వల స్వాధీనంలో కీలకపాత్ర పోషించిన కమీషనరేట్ ప్రత్యేక విభాగం పోలీసు అధికారులు జానీమియా, మల్లేశంలతోపాటుగా వివిధ స్థాయిలకు చెందిన పోలీసులను పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి తరపున అభినందించారు.

పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధమైన పేనపేర్కొన్న వారిపై కేసులను నమోదు చేశామని, ఇందులో ఇప్పటి వరకు డ్రైవర్ మహేష్, వ్యాపారి పర్వతం గంగాధర్‌లను అరెస్ట్ చేశామని, వాహనం యజమాని పుల్లయ్య పరారీలో ఉన్నాడని రామడుగు ఎస్ఐ గొల్లపల్లి అనూష తెలిపారు.

అక్రమకార్యకలాపలకు సంబంధించిన సమాచారం అందించే వారికి నగదు పారితోషికం

ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు సమాచారం అందించిన వారికి నగదుపారితోషికం అందజేయడంతోపాటు వారిపేర్లను గోప్యంగా ఉంచుతామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు. పిడిఎస్‌బియ్యం, ఇతర అక్రమ, అసాంఘీక కార్యకలాపాల నియంత్రణకోసం ప్రత్యేకనిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. నేరరహిత పోలీస్ కమీషనరేట్ లక్ష్యంగా పోలీస్‌శాఖ కృషిచేస్తోందని చెప్పారు.

రాష్ట్రంలో దంచికొడుతున్న ఎండలు

హైదరాబాద్ : రాష్ట్రంలో క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ఎండలు దంచికొడుతున్నాయి. రాష్ట్రంలో 45 నుంచి 46 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. తెలంగాణలోని పలు ప్రాంతాలు నిప్పుల కుంపటిలా మారాయి. భానుడి భగభగలకు ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు నమోదైన ఉష్ణోగ్రతల వివరాలను టీఎస్‌డీపీఎస్ వెల్లడించింది.

పెద్దపల్లి జిల్లా మంథనిలో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, జగిత్యాల జిల్లా ధర్మపురిలో 46.5 డిగ్రీలు, ఖమ్మం జిల్లా ఉంకూరులో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9 గంటలకే ఎండలు భగభగమంటున్నాయి. పగటిపూటనే ఉక్కపోత తీవ్రంగా ఉంది. చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ వేడిమి తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ఉత్తర ఈశాన్యం వైపు నుంచి వీస్తున్న వేడిగాలులు, పొడి వాతావరణం కారణంగా రాగల మూడు రోజుల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించిన విషయం విదితమే. రాష్ట్రంలో గురువారం వడదెబ్బతో నలుగురు మృతి చెందారు.

ప్రభుత్వ పంటల విధానం బూటకం

పత్తి వద్దన్న సిఎం ఎందుకు వుయమంటున్నారు
పత్తి విత్తన కంపెనీలతో కెసిఆర్ కుమ్మక్కు
వేయాల్సిన పంటలకు ముందే ధరలు ప్రకటించాలి
మనకూ మంచి రోజులు వస్తాయంటూ కార్యకర్తలకు రేవంత్ అభయం

జగిత్యాల,మే22(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ పాలసీ కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం ఆమోద యోగ్యం కాదని ఎంపీ రేవంత్ రెడ్డి అన్నారు. కేవలం రైతుబందు ఎగ్గొట్టడానికే కేసీఆర్ ఈ విధానాన్నిప్రవేశపెట్టాడని అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్ లో మీడియాతో రేవంత్ మాట్లాడుతూ.. కేసీఆర్ చెప్పిన వ్యవసాయ విధానాన్ని తొలుత గ్రామాలలోని గ్రామ సభల్లో ప్రవేశపెట్టిన అనంతరం ప్రజలు ఆమోదం తెలిపితేనే అమలు చేయాలన్నారు. రైతు పండించే పంటలకు ముందుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే వారే ఆ పంటలు పండించుకుంటారని అన్నారు. ఒకప్పుడు రైతుల ఆత్మహత్యలకు పత్తి పంట కారణమని శాసన సభలో మాట్లాడిన ఆయన ఇప్పుడు పత్తి పంట ఎక్కువ పండిచాలని అనడం విడ్డూరంగా ఉందని అన్నారు. 70 లక్షల ఎకరాల్లో పత్తి పంట పండిస్తే కేవలం లాభపడేది పత్తి

విత్తనాలు అమ్మేవాళ్లేనని అన్నారు. కేవలం రైతుబంధు ఎగ్గొట్టడానికే ఈ డ్రామాలన్ని ఆడుతున్నారన్నారు. ముందు రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని, ఈనాడు కష్టపడ్డ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ అదుకుంటుందని రేవంత్ అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవపంత్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కరీంనగర్ జిల్లా, అలుగునూరులో జరిగిన ఈ కార్యక్రమంలో రేవంత్ పాల్గొన్నారు. దేశాన్ని సమైక్యంగా ఉంచడానికి గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందని ఆయన కొనియాడారు. ప్రపంచంలో భారతదేశాన్ని ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తూ ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ తమ ప్రాణాలను కూడా బలిచ్చారని ఆయన అన్నారు. యువత రాజీవ్ గాంధీని స్ఫూర్తిగా తీసుకోని ముందుకెళ్లాలన్నారు. దళిత, బడుగు, బహుజన, మైనార్టీ వర్గాల అభ్యున్నతి జరగాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యం. కంప్యూటర్ రంగంలో ప్రస్తుతం భారత దేశం అగ్రగామిగా ఉందంటే దానికి రాజీవ్ కృషే కారణం. వ్యవసాయం, ఐటీ రంగంపై అత్యధిక దృష్టి పెట్టింది కాంగ్రెస్ పార్టీ మాత్రమే. శ్రీశైలం, నాగార్జున సాగర్ లాంటి సాగునీటి ప్రాజెక్టులన్నీ కట్టింది కాంగ్రెస్ కాదా? కాళేశ్వరం నుంచి 2 టీఎంసీలు ఎత్తిపోశామంటూ కేసీఆర్ గొప్పలు చెప్పుకుంటు న్నారు. కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులు వానలతో నిండితే ఆ ఘనత తనదేనని కేసీఆర్ చెప్పుకుంటున్నారు. కృష్ణా, గోదావరిని దివి నుంచి భువికి తెచ్చింది తానేనన్నంతగా కేసీఆర్ ప్రచారం చేసుకుంటున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు రాజీవ్ స్ఫూర్తితో పనిచేయాలి. ఎవరూ ఆందోళన చెందొద్దు. తొందర్లోనే మనకూ మంచి రోజులు వస్తాయి. ఎవడెవడు ఎగిరిగిరి దునకుతున్నడో లెక్కలు రాసి పెట్టండి. మనకూ అధికారం వస్తుంది. మిత్తితో సహా లెక్క చెల్లిద్దాం. ఎండకాలం తర్వాత వానకాలం వచ్చినట్లే.. మనకూ మంచి రోజులు వస్తాయి. కాంగ్రెస్ కార్యకర్తలను ఆదుకుంటాం. పార్టీకి అండగా ఉన్నవాళ్ల సేవలను గుర్తిస్తాం అని రేవంత్ అన్నారు

ప్రజల కోసమే బస్తీ దవాఖానాలు

మూసాపేటలో ప్రాంభించిన మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్,మే22(ఆర్ఎన్ఎ): పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బస్తీ దవాఖానలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుండతో జీహెచ్ఎంసీ పరిధిలో కొత్తగా మరో 45 బస్తీ దవాఖానలను మంత్రులు ప్రారంభిస్తున్నారు. ఎర్రగడ్డ సుల్దాన్ నగర్, యాదగిరి నగర్‌లో బస్తీ దవాఖానలను మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు.మూసాపేట్ సర్కిల్ కేపీ హెచ్ బీ కాలనీ 4వ ఫేస్ లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానను మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కూర్మయ్య గారి నవీన్ కుమార్, కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు, మేడ్చల్ జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసమే రాష్ట్ర ప్రభుత్వం బస్తీ దావఖానలను ఏర్పాటు చేస్తుందన్నారు. అలాగే మోండా మార్కెట్ డివిజన్ లో మంత్రి తలసాని శ్రీనివాస్ ప్రారంభించారు. కాగా, కొత్తగా హైదరాబాద్ జిల్లాలో 22, మేడ్చల్ జిల్లాలో 15, రంగారెడ్డి జిల్లాలో 3 బస్తీ దవాఖానలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే జీహెచ్ఎంసీ పరిధిలో 124 బస్తీ దవాఖానలు సేవలు అందిస్తున్నాయి.

డాక్టర్ సుధాకర్ కేసులో హైకోర్టు సీరియస్

విశాఖ పోలీసులపై ఆగ్రహం..కేసు సిబిఐ విచారణకు అప్పగింత
తమకు న్యాయం జరుగుతుందన్న సుదాకర్ తల్లి
దళితులపై వైకాపా కక్షకట్టిందన్న మాజీమంత్రి జవహర్

అమరావతి,మే22(ఆర్ఎన్ఎ): వివాదస్పదంగా మారిన డాక్టర్ సుధాకర్ కేసును ఏపీ హైకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించింది. శుక్రవారం జరిగిన వాదనల తర్వాత ఈ న్యాయమూర్తి ఈ నిర్ణయం తీసుకున్నారు. డాక్టర్ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును ధర్మాసనం తప్పుబట్టింది. వెంటనే సీబీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయాలని సూచించింది. 8 వారాల్లోగా దీనికి సంబంధించిన వివరాలను కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. సర్వీసట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా పని చేస్తున్న సుధాకర్ ప్రభుత్వం తమకు మాస్కులు ఇవ్వలేదంటూ ఆరోపించాడు. దీంతో అతనిపై క్రమశిక్షణ చర్యల కింద సస్పెన్షన్ వేటు వేశారు. ఆ తర్వాత కొన్ని రోజులుకు ఇటీవల అర్ధనగ్నంగా నడిరోడ్డుపై పిచ్చిగా అరుస్తూ.. కనిపించాడని, అతని చర్యతో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో అతనిపై పోలీసులు వ్యవహరించిన తీరు వివాదస్పదమైంది.ఆ తర్వాత కేజీహెచ్‌లో చేర్పించగా.. మానసిక పరిస్థితి బాగోలేదని తేల్చారు. ఈ వ్యవహారంపై విపక్షాలు కూడా మండిపడ్డాయి. సుధాకర్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ క్రమంలోడాక్టర్ సుధాకర్ వ్యవహారంపై హైకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. విశాఖ పోలీసులపై కేసు నమోదు చేసి విచారణ జరపాలని సీబీఐను ఆదేశించింది. 8 వారాల్లోగా విచారణ పూర్తిచేసి నివేదిక ఇవ్వాలని ఆదేశాల్లో తెలిపింది. సుధాకర్ శరీరంపై గాయాలున్న విషయం మేజిస్ట్రేట్ నివేదికలో ఉందని, ప్రభుత్వం ఇచ్చిన నివేదికలో గాయాల ఊసే లేదని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ నివేదికను నమ్మడం లేదని... దీని వెనుక భారీ కుట్ర ఉందని భావిస్తున్నామని, ఈ కారణాలతో సీబీఐ విచారణకు ఆదేశిస్తున్నట్టు తెలిపింది. గత శనివారం డాక్టర్ సుధాకర్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. సుధాకర్ మానసిక స్థతి సరిగ్గా లేదని కేజీహెచ్ వైద్యులు చెప్పడంతో మెంటల్ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును సుమోటోగా తీసుకున్న హైకోర్టు.. శుక్రవారం విచారణ జరిపి తాజా ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు తీర్పుపట్ల డాక్టర్ సుధాకర్ తల్లి హర్షం వ్యక్తం చేశారు. కేసు విచారణను సీబీఐకి బదిలీ చేయడం శుభపరిణామం అన్నారు. హైకోర్ట